

2 లో రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో అగ్రగామిగా నిలిపాం

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM



**విలేకరులు కావలెను**

సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7569677170



ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :201 సంపాదకులు: కలిచేటి వెంకయ్య గురువారం 18 జూన్ 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad


# జీ7 వేదికపై అమెరికాను నిలదీసిన మోదీ

## భారత నావికుల మృతిపై ప్రధాని ఆవేదన

జీ7 సదస్సులో భారత నావికుల మృతి అంశాన్ని ప్రస్తావించిన ప్రధాని మోదీ

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సమక్షంలోనే యూఎస్ దాడులపై ఆందోళన వ్యక్తీకరణ

హర్మూజ్ జలసంధిలో నావికుల భద్రత, వాణిజ్య మార్గాల పరిరక్షణ అందరి బాధ్యత అని పిలుపు



ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమక్షంలోనే కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమాసియాలో అమెరికా జరిపిన సైనిక దాడుల్లో భారతీయ నావికులు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సముద్ర వాణిజ్య మార్గాలను సురక్షితంగా ఉంచడం, నావికుల భద్రతను నిర్ధారించడం ప్రపంచ దేశాల సమష్టి బాధ్యత అని ఆయన గట్టిగా నొక్కి చెప్పారు. నిన్న జరిగిన జీ7 అవుట్‌రీచ్ సెషన్‌లో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు జరుగుతున్న ప్రయత్నాలను తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. "ఆ ప్రాంతంలో కొనసాగుతున్న సంఘర్షణల వల్ల మన మిత్ర దేశాలలో తీవ్రమైన ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. ముఖ్యంగా, హర్మూజ్ జలసంధి గుండా జరిగే సముద్ర వాణిజ్యానికి అంతరాయం కలగడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. ఈ ఘర్షణల కారణంగా పలువురు భారతీయ పౌరులు కూడా ప్రాణాలు కోల్పోయారు" అని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. దేశాలను వాణిజ్య పరంగా కలిపే నావికుల భద్రతను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని ఆయన మిగతా 2లో...

# దేశవ్యాప్తంగా 'ఎల్ నినో' ముప్పు..

ఏపీ, తెలంగాణ సహా 12 రాష్ట్రాల్లో వర్షాభావం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 12 రాష్ట్రాలపై ఎల్ నినో ప్రభావం

ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించిన కేంద్ర వ్యవసాయ మంత్రి

ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచన



**న్యూఢిల్లీ:** రైతులకు, వ్యవసాయ రంగానికి ఆందోళన కలిగించే ఒక కీలక అప్‌డేట్ వాతావరణ శాఖ నుండి వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దేశంలోని దాదాపు 12 రాష్ట్రాలపై 'ఎల్ నినో' తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ముందస్తుగా అప్రమత్తమైంది. ఖరీఫ్ 2026 సన్నద్ధతపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాధారణం కంటే తక్కువగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని కీలక వ్యవసాయ ఆధారిత రాష్ట్రాలపై ప్రభావం ఉంటుందని తెలిపింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, రాజస్థాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బీహార్, ఝార్ఖండ్, ఉత్తర్ ప్రదేశ్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో, శివరాజ్ సింగ్ చౌహాన్ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు తగ్గితే రైతులు నష్టపోకుండా ఉండేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో ఉన్న జిల్లా అధికారులు, రాష్ట్రాల వ్యవసాయ విభాగాలు, కృషి విజ్ఞాన్ కేంద్రాలు, ఇతర అనుబంధ సంస్థలతో తక్షణమే సమన్వయ సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. కరువు లాంటి పరిస్థితులు ఎదురైతే ప్రత్యామ్నాయ పంట ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.



# ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డికి భద్రత కొనసాగింపు

ప్రభుత్వానికి హైకోర్టులో చుక్కెదురు

ఫుడ్ కమిషన్ ఛైర్మన్ భద్రత పునరుద్ధరణపై కీలక పరిణామం

సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని చెప్పిన డివిజన్ బెంచ్

ఛైర్మన్ చిట్టా విజయప్రతాప్ రెడ్డికి 1+1 భద్రత కొనసాగింపు

ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ జరిపిన ధర్మాసనం

ఈ అంశంలో లోతైన పరిశీలన అవసరమని స్పష్టం చేసిన కోర్టు

**అమరావతి, సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆహార కమిషన్ (ఫుడ్ కమిషన్) ఛైర్మన్ విజయప్రతాప్ రెడ్డి భద్రత వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఏపీ హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు 1+1 భద్రతను పునరుద్ధరించాలని గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకునేందుకు హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది. ఈ విషయంలో ప్రభుత్వ వాదనలను తోసిపుచ్చుతూ, ప్రస్తుత దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, ఫుడ్ మిగతా 2లో...

# ఇంటింటికి యోగా థీమ్‌తో యోగాడే

ప్రజారోగ్యం కోసం సంజీవనితో యోగా అనుసంధానం - యోగాంధ్రపై సమీక్షలో అధికారులతో సీఎం చంద్రబాబు

రాష్ట్రవ్యాప్తంగా 1.33 లక్షల సెంటర్లలో యోగా డేకు ఏర్పాట్లు - యోగాడే కోసం కోటి దాటిన రిజిస్ట్రేషన్లు

20, 21వ తేదీల్లో బాబా రాందేవ్‌తో కలిసి హాజరు కానున్న సీఎం



**అమరావతి, సింధూరదర్శిని:** సంజీవని కార్యక్రమంతో అనుసంధానం ద్వారా యోగాను రాష్ట్రంలో ప్రతీ ఇంటికి తీసుకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఆరోగ్యంపై అందరూ ధ్యాస పెట్టేలా....యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన యోగా డే కార్యక్రమం నిర్వహణపై అధికారులతో ముఖ్యమంత్రి సచివాలయంలో బుధవారం సమీక్ష నిర్వహించారు. యోగాంధ్ర నిర్వహణకు మిగతా 2లో...

# ఓటమి నాలో కసి పెంచింది.. మంగళగిరి అభివృద్ధిపై లోకేష్ భావోద్వేగం

మంగళగిరిని రాష్ట్రంలోనే నెం.1గా తీర్చిదిద్దుతానన్న లోకేష్

జగన్ బెంగళూరులో కాకుండా ఏపీలో నివసిస్తే వాస్తవాలు తెలుస్తాయని చురక

జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీని ఆపలేరని వ్యాఖ్య

కావాలనే వైసీపీ నేతలు కోర్టుల్లో కేసులు వేస్తున్నారని ఆరోపణ



**మంగళగిరి, సింధూరదర్శిని:** రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన సొంత నియోజకవర్గమైన మంగళగిరిని అన్ని రంగాల్లో నెం. 1గా తీర్చిదిద్దుతానని స్పష్టం చేశారు. బుధవారం మంగళగిరిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, గెలిచిన మొదటి రోజు నుంచే అభివృద్ధి ప్రణాళికలను అమలు చేస్తున్నామని తెలిపారు. మిగతా 2లో...



# అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్‌కళ్యాణ్

జన్యుపరమైన అనారోగ్యంతో పోరాడుతున్న హనుమకొండకు చెందిన నిరంజన్

అభిమాని కోరికను గౌరవించి ఇంటికి వెళ్లి పరామర్శించిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి

ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. తల్లిదండ్రులకు భరోసా..

వైద్య ఖర్చుల నిమిత్తం రూ.లక్ష ఆర్థిక సాయం

నిరంజన్ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ శ్రీ వెంకటేశ్వరస్వామి తీర్థప్రసాదాలు అందజేత

వరంగల్ భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు

**తెలంగాణ, సింధూరదర్శిని:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మరోసారి మానవత్వాన్ని చాటుకున్నారు. అరుదైన డి.ఎన్.డి అనే జన్యుపరమైన వ్యాధితో బాధ పడుతూ ఎదుగుదల లేని స్థితిలో, మంచానికే పరిమితం అయిన యువ అభిమాని కోరికను మన్నించి స్వయంగా అతని నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఆర్థిక భరోసాతో పాటు భగవంతుని తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణ రాష్ట్రం హనుమకొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌కి చెందిన 17 ఏళ్ల నిరంజన్ అరుదైన వ్యాధితో పోరాడుతున్నాడు. తన చివరి కోరికగా పవన్‌కళ్యాణ్‌ని కలవాలని అభిలషించారు. తెలంగాణ జనసేన నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి బుధవారం స్వయంగా నిరంజన్ ఇంటికి వెళ్లారు. అతన్ని దగ్గరకు తీసుకుని పరామర్శించారు. తల్లిదండ్రులు పొనుగోటి రాంగోపాల్, శ్రీమతి మానసతో మాట్లాడి నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యం ఎక్కడ చేయిస్తున్నారు? అతన్ని కాపాడుకోవడానికి ఏం చేయొచ్చు అన్న మిగతా 2లో...

# జీ7 వేదికపై అమెరికాను నిలదీసిన మోదీ

**(మొదటిపేజీ తరువాయి)**

స్పష్టం చేశారు. ఇరాన్‌కు సంబంధించిన ఓడరేవులపై అమెరికా విధించిన దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తున్నాయన్న అనుమానంతో ఇటీవల కొన్ని వాణిజ్య నౌకలపై యూఎస్ సైనిక దాడులు జరిపింది. ఈ నేపథ్యంలో మోదీ వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. జూన్ 9న ఒమన్ గల్ఫ్‌లో పలావు జెండాతో ప్రయాణిస్తున్న 'సెట్టెబెల్లో' అనే చమురు ట్యాంకర్‌పై అమెరికా జరిపిన దాడిలో ముగ్గురు భారతీయ నావికులు మరణించారు. ఆ నౌకలో మొత్తం 28 మంది సిబ్బంది ఉండగా, వారిలో 24 మంది భారతీయులే. అంతకుముందు, జూన్ 8న 24 మంది భారతీయ సిబ్బందితో ఉన్న 'మారివెక్స్' అనే మరో నౌకపైనా దాడి జరిగింది. అయితే అందులోని సిబ్బందిని సురక్షితంగా కాపాడారు. జూన్ 11న 20 మంది భారతీయులతో ఉన్న 'జల్వీర్' నౌకను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. ఈ నౌకలేవీ భారత్‌కు చెందినవి కావు, విదేశీ జెండాలతో ప్రయాణిస్తున్నాయి. ఈ దాడులపై భారత విదేశాంగ శాఖ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయ అధికారిని పిలిపించి తమ ఆందోళనను తెలియజేసినట్లు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ధ్రువీకరించారు. "మా నావికా సమాజం సంక్షేమానికి మేము అత్యంత ప్రాధాన్యత ఇస్తాము. ఈ దాడులను వెంటనే ఆపాలి" అని ఆయన డిమాండ్ చేశారు. ప్రపంచ చమురు, వాణిజ్య రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైనది. ఇక్కడ పెరుగుతున్న ఉద్రిక్తతల వల్ల విదేశీ నౌకలపై పనిచేస్తున్న భారతీయ నావికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది. జీ7 సదస్సు వేదికగా ప్రధాని మోదీ ఈ అంశాన్ని లేవనెత్తడం, సముద్ర భద్రతకు, మధ్యప్రాచ్యంలో పనిచేస్తున్న ప్రవాస భారతీయుల రక్షణకు భారత్ ఇస్తున్న ప్రాధాన్యతను తెలియజేస్తోంది. సదస్సు ముగింపులో ప్రధాని మోదీ, అధ్యక్షుడు ట్రంప్ మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగే అవకాశం ఉంది. ఈ సమావేశంలో ఈ అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని దౌత్య వర్గాలు భావిస్తున్నాయి.

## ఫుడ్ కమిషన్ ఛైర్మన్ విజయప్రతాప్‌రెడ్డికి భద్రత కొనసాగింపు

**(మొదటిపేజీ తరువాయి)**

కమిషన్ ఛైర్మన్‌గా ఉన్న విజయప్రతాప్ రెడ్డికి కల్పించిన భద్రతను ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆయన హైకోర్టును ఆశ్రయించగా, విచారణ జరిపిన సింగిల్ జడ్జి ఆయనకు 1o1 భద్రతను వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేసింది. మంగళవారం ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం, ఈ అంశంలో లోతైన పరిశీలన అవసరమని అభిప్రాయపడింది. అందువల్ల, సింగిల్ జడ్జి ఉత్తర్వులపై స్టే ఇచ్చేందుకు లేదా వాటిని సవరించేందుకు న్యాయస్థానం అంగీకరించలేదు. డివిజన్ బెంచ్ నిర్ణయంతో ఫుడ్ కమిషన్ ఛైర్మన్‌కు ప్రస్తుతం 1o1 భద్రత కొనసాగనుంది. అనంతరం ఈ కేసు విచారణను ధర్మాసనం మూడు నెలలకు వాయిదా వేసింది. తదుపరి విచారణ సందర్భంగా ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి వాదనలు విననున్నట్లు కోర్టు వెల్లడించింది.

## ఓటమి నాలో కసి పెంచింది.. మంగళగిరి అభివృద్ధిపై లోకేష్ భావోద్వేగం

**(మొదటిపేజీ తరువాయి)**

2019లో 5,300 ఓట్ల తేడాతో ఓడిపోయినప్పుడు కలిగిన బాధ, ఆవేదన తనలో కసి పెంచిందని లోకేష్ గుర్తుచేసుకున్నారు. ఆ కసితోనే ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నానని, 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోనే మూడో అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రజలు తనకు కొండంత అండగా నిలిచారని పేర్కొన్నారు. ఈ నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో సుమారు రూ.1200 కోట్ల అంచనా వ్యయంతో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, భూగర్భ విద్యుత్ లైన్లు, తాగునీరు, గ్యాస్ పైప్ లైన్ సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ కృషితో కేంద్రం నుంచి అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వంద పడకల ఆసుపత్రి, పార్కులు, కమ్యూనిటీ భవనాలు, స్మశాన వాటికల అభివృద్ధి వంటి పనులు వేగంగా చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై లోకేష్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "పులివెందుల ఎమ్మెల్యే బెంగళూరులో కాకుండా ఏపీలో నివసిస్తే వాస్తవాలు తెలుస్తాయి. ఆయన వారంలో మూడు రోజులు బెంగళూరు, ఒకరోజు తాడేపల్లి, మరో మూడు రోజులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. అందుకే ఆయనను 'బెంతహై' (బెంగళూరు, తాడేపల్లి, హైదరాబాద్) అని పిలవాల్సి వస్తోంది" అని ఎద్దేవా చేశారు. విజనరీకి, ప్రిజనరీకి చాలా తేడా ఉంటుందని, ప్రిజనరీ ఆలోచనలు ఎప్పుడూ జైలు చుట్టూనే తిరుగుతాయని విమర్శించారు. హోంమంత్రి అనితపై మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను ఖండించిన లోకేష్, "గొడ్డలి బ్యాచ్‌కు మహిళలను గౌరవించే సంస్కారం లేదు" అని మండిపడ్డారు. డీఎస్సీ నోటిఫికేషన్‌పై వైసీపీ చేస్తున్న ఆరోపణలను లోకేష్ తిప్పికొట్టారు. "జగన్ ఎన్ని జన్మలెత్తినా డీఎస్సీ ప్రక్రియను ఆపలేరు. కూటమి ప్రభుత్వం కేవలం 150 రోజుల్లోనే 16 వేల టీచర్ పోస్టులు భర్తీకి శ్రీకారం చుట్టింది. హారిజాంటల్ రిజర్వేషన్ గురించి అవగాహన లేని వైసీపీ నేతలే కోర్టుల్లో 240 కేసులు వేసి అడ్డుకుంటున్నారు. డీఎస్సీపై ఎప్పుడైనా, ఎక్కడైనా చర్చకు నేను సిద్ధం" అని సవాల్ విసిరారు. నిడమర్రు ఆర్వోబీని 18 నెలల్లో పూర్తి చేస్తామని, మంగళగిరిని ఒక ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని లోకేష్ పునరుద్ఘాటించారు.




# ఇంటింటికి యోగా థీమ్‌తో యోగాడే

**(మొదటిపేజీ తరువాయి)**

చేస్తున్న ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే వారికి అన్ని సౌకర్యాలు కల్పించాలని సీఎం నిర్దేశించారు. అత్యుత్త ప్రదర్శన కనపర్చిన యోగా మాస్టర్ ట్రైనర్లకు వచ్చే ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజు ప్రత్యేక పురస్కారాలు అందజేయాలని సీఎం సూచించారు. "ఇంటింటికీ యోగా" ప్రధాన థీమ్‌గా ఏడాది పాటు కార్యాచరణ ప్రణాళిక చేయాలన్నారు. వివిధ వైద్య సమస్యలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం ప్రత్యేక "థెరప్యూటిక్ యోగా" కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేయాలని చెప్పారు. ఈసారి యోగా డేకు రాష్ట్రానికి ప్రత్యేక అతిధిగా వస్తున్న ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్‌తో కలిసి ఈనెల 20న ఉండవల్లి గుహల దగ్గర జరిగే యోగా కార్యక్రమంలో పాల్గొనాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. 21వ తేదీన విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహించనున్నారు. స్టేడియంలో 5 వేలు నుంచి 6 వేల మంది యోగా చేసేలా ఏర్పాట్లు చేసినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూడా బాబా రాందేవ్ సహా ముఖ్యమంత్రి హాజరవుతారు. వర్షం కారణంగా ఏమైనా అవాంతరం తలెత్తితే.. ప్రత్యామ్నాయంగా విజయవాడలోని అంబేద్కర్ కళావేదికలో వెయ్యి మందితో స్టేట్ ఈవెంట్ నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. యోగా ప్రచారంలో భాగంగా 19వ తేదీనే రాష్ట్రానికి వస్తున్న బాబా రాందేవ్... అదే రోజు ముఖ్యమంత్రితో సమావేశం అవుతారు. యోగాంధ్రలో భాగంగా ఇప్పటివరకు 2.6 లక్షల మందిని ట్రైనర్లుగా తీర్చిదిద్దినట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 21న యోగాడేలో పాల్గొనేందుకు ఇప్పటికే కోటికి మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ముఖ్యమంత్రికి తెలిపారు. 18వ తేదీ నుంచి 20 వరకు విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు అధికారులు వివరించారు. 21వ తేదీన 1.33 లక్షల సెంటర్లలో యోగా కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్నామని సీఎంకు తెలిపారు. 21 తేదీన 'యోగాఏడెస్టినేషన్' పేరుతో వచ్చే ఏడాది యోగా డే వరకు కేలండర్‌ను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారు.

ఈ సమీక్షకు ప్రభుత్వ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ చక్రధర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ షా, ఆయుష్ డైరెక్టర్ రోణంకి గోపాలకృష్ణ తదితరులు హాజరయ్యారు.

# అభిమాని నిరంజన్‌ను పరామర్శించిన పవన్ కళ్యాణ్

**(మొదటిపేజీ తరువాయి)**

విషయాలపై ఆరా తీశారు. ధైర్యంగా ఉండాలని భగవంతుడి ఆశీస్సులు బాబుకి ఉంటాయని చెప్పి కుటుంబ సభ్యులకు మనో ధైర్యం నింపారు. శ్రీ వెంకటేశ్వరస్వామి వారి తీర్థ ప్రసాదాలు అందించి భగవంతుని ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. నిరంజన్ ఆరోగ్యం కోసం వరంగల్ విఖ్యాత భద్రకాళి అమ్మవారి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేయిస్తానని తెలిపారు.

**చలించిపోయిన పవన్ కళ్యాణ్**

నిరంజన్ ను చూసేందుకు వచ్చిన పవన్ కళ్యాణ్ ఆతనితో చాలా సమయం గడిపారు. ఇంట్లోకి వచ్చిన శ్రీ పవన్ కళ్యాణ్ గారు లేవలేని స్థితిలో ఉన్న అభిమానిని చూసి చలించిపోయారు. అతని మంచంపై కూర్చుని ఆత్మీయంగా హత్తుకున్నారు. నుదిటిపై ముద్దు పెట్టి ఆప్యాయంగా పలకరించారు. 'చిన్ననాటి నుంచి మీరంటే అభిమానం' అని నిరంజన్ చెప్పిన మాటలు విని కదలిపోయారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి తెప్పించిన వస్త్రాన్ని అతనికి కప్పి, కళ్యాణం అక్షతలు ఇచ్చి ఆశీర్వదించారు. భద్రకాళి అమ్మవారి వెండి ప్రతిమకు ఆలయంలో పూజ చేయించి కుటుంబ సభ్యులకు అందజేస్తానని తెలిపారు.

నిరంజన్ ఆరోగ్యంగా ఉన్న సమయంలో శ్రీ పవన్ కళ్యాణ్ గారిని అనుకరిస్తూ చేసిన డాన్సుల తాలూకు వీడియోలు, ఫొటోలను తిలకించారు. అంతా తనని చోటా గబ్బర్ సింగ్ అని పిలుస్తారని నిరంజన్ చెప్పాడు.

**కుటుంబ జీవనోపాధికి క్యాంటీన్**

ఈ సందర్భంగా నిరంజన్ ఓ కుక్క పిల్ల బొమ్మ చూపి పెంచుకోవాలని ఉందని చెప్పగా, కొని పంపుతానని హామీ ఇచ్చారు. కుక్కను పెంచుకోవడానికి ఇంటి ఓనర్స్ అనుమతి కావాలని నిరంజన్ తండ్రి చెప్పగా, స్వయంగా ఆ ఇంటి ఓనర్స్ ని పిలిపించి మాట్లాడారు. నిరంజన్ తల్లిదండ్రులు వృత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంలో కాకతీయ ఆసుపత్రి క్యాంటిన్లో పని చేసేవారమని చెప్పగా, వారి జీవనోపాధి మెరుగుపర్చేందుకు క్యాంటిన్ పెట్టించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర నాయకులకి దిశానిర్దేశం చేశారు.

నిరంజన్ పరామర్శ పూర్తయిన వెంటనే పవన్ కళ్యాణ్ నేరుగా వరంగల్ భద్రకాళి అమ్మవారి ఆలయానికి బయలుదేరి వెళ్లారు. పవన్ కళ్యాణ్‌తోపాటు జనసేన పార్టీ తెలంగాణ ఇంఛార్జ్ శంకర్ గౌడ్, పార్టీ ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్ తాళ్లూరి, పార్టీ నాయకులు రాధారం రాజలింగం, ఆర్ కె సాగర్ తదితరులు ఉన్నారు.

# రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో అగ్రగామిగా నిలిపాం

### కోవూరు అభివృద్ధికి రూ.721.25 కోట్లతో పనులు

### మహిళలను కించపరిచే నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు: ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కోవూరు( సింధూర దర్శిని) 17 జూన్ నెల్లూరు జిల్లా ; రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లుపూర్తి చేసుకోవడం, అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా కోవూరులో '2ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' పేరిట విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సభకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధ్యక్షత వహించి ప్రసంగించారు. వేదికపై ఉన్న కూటమి నాయకులు, జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, ఒక్క పని కూడా చేయని పరిస్థితి నుంచి కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని గాడిలో పెట్టిందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేసి చూపించారని అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీలోపు ఇంటి వద్దకే వెళ్లి వృద్ధులకు రూ.4,000 పెన్షన్, దివ్యాంగులకు రూ.6,000, వీల్‌చైర్ లేదా మంచానికే పరిమితమైన వారికి రూ.15,000 పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. 'తల్లికి వందనం' పథకం కింద కుటుంబంలోని పిల్లలందరికీ ప్రయోజనం కల్పిస్తున్నామని, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, నాణ్యమైన బ్యాగులు, పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాల జారీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమం ద్వారా రీ-సర్వేలు, 22-ఏ భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. దీపం-2 కింద మూడు గ్యాస్ సిలిండర్లు, మత్స్యకారులు, ఆటో డ్రైవర్లు, చేనేత కార్మికులకు వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, మగ్గాలకు 200యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500యూనిట్ల ఉచితవిద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం మూసివేసిన అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా 268 క్యాంటీన్లలో రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్లలో డీఎస్సీ నిర్వహించకపోగా, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు, 6 వేల పోలీసు కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసిందన్నారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకువచ్చి, ఇప్పటికే 6 లక్షల ఉద్యోగాలు కల్పించామని, 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

**రూ.721.25 కోట్లతో కోవూరు నియోజకవర్గ అభివృద్ధి**

కోవూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. 30 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన కిసాన్ సెజ్‌కు రూ.15 వేల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని, దీని ద్వారా స్థానిక యువతకు భారీగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే షుగర్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారానికి అధికారులు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి కృషి చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో సుమారు రూ.721 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా 323 సీసీ రోడ్ల పనులను రూ.17 కోట్లతో, 47 విలేజ్ హెల్త్ సెంటర్లను రూ.14.76కోట్లతో, మేజర్ ప్రాజెక్టులకు రూ.17 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.55 కోట్ల పనులు చేపట్టామని, అదనంగా రూ.11 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం కోసం ఓవర్ హెడ్ ట్యాంకులు, జల్ జీవన్ మిషన్ పైప్‌లైన్లు, సీసీ డ్రెయిన్లతో కలిపి 356 పనులకు రూ.30.55 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రోడ్ల అభివృద్ధిలో భాగంగా నెల్లూరు-మైపాడు రోడ్డు రూ.48 కోట్లతో, బుచ్చి-దగదర్తి రోడ్డు రూ.28 కోట్లతో, బుచ్చి-ఊటుకూరు రోడ్డు రూ.8 కోట్లతో అభివృద్ధి చేశామని, మొత్తం 28 రోడ్లకు రూ.149.12 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. ముదువర్తి--ముదువర్తిపాళెం కాజ్‌వేకు రూ.93.32కోట్లు కేటాయించి ఇప్పటికే 40 శాతం పనులు పూర్తయ్యాయని, కాలువల పూడికతీత, కట్టల బలోపేతానికి రూ.202.49 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. విద్యుత్ శాఖలో ఆర్‌డీఎస్ఎస్ కింద రూ.112 కోట్ల పనుల్లో 70 శాతం పూర్తయ్యాయని, కుడితిపాళెం సబ్‌స్టేషన్‌కు రూ.3.22 కోట్లు, పంచేడు సబ్‌స్టేషన్‌కు రూ.3.75 కోట్లు, పీఎం సూర్యఘర్ యోజన కింద ఎస్సీ, ఎస్టీలకు రూ.122 కోట్లు, మొత్తం రూ.268.45 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష కింద డైట్ పల్లిపాడు కళాశాలకు రూ.13 కోట్లతో శంకుస్థాపన చేయగా, మొత్తం రూ.15.95 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు. దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ కింద రూ.9.35 కోట్లు, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 12 భజన మందిరాలకు రూ.1.75 కోటి, సీఎంఆర్ఎఫ్ ద్వారా 900 మందికి రూ.9.21 కోట్లు, అలాగే వీపీఆర్ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. కేవలం 24 నెలల్లోనే కోవూరు నియోజకవర్గంలో రూ.721.25 కోట్ల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

**మహిళలను కించపరిచే నాయకులను మహిళలే తిరస్కరిస్తారు**

ప్రజలు తనను 55 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించారని గుర్తుచేసుకున్న ఎమ్మెల్యే , మహిళలను అవమానించే వ్యాఖ్యలు చేసే ప్రతిపక్ష నాయకులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హోంమంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను ఖండించిన ఆమె, కోవూరులో కూడా మహిళలను కించపరిచేలా మాట్లాడుతున్న నాయకుల తీరును తప్పుబట్టారు. 'మహిళలకు మర్యాద ఇవ్వని వారికి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదు. మహిళలను కించపరిచే నాయకులను మహిళలే తరిమి తరిమి కొడతారు' అని హెచ్చరించారు. తన పేరును ఉద్దేశించి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని, ప్రజల విశ్వాసంతో ఎన్నికైన ప్రజాప్రతినిధిగా సేవ చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. అవినీతి, కమీషన్ల రాజకీయాలు చేసే వారికి ప్రజలు ఇప్పటికే తగిన గుణపాఠం చెప్పారని, భవిష్యత్తులోనూ అలాంటి నాయకులను ప్రజలు తిరస్కరిస్తారని అన్నారు. తీరు మార్చుకోకపోతే జీవితాంతం మాజీ ఎమ్మెల్యేగానే మిగిలిపోవాల్సి వస్తుందని చెప్పారు. 'మహిళలను కించపరిచే ఏ నాయకుడికీ మహిళల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే హక్కు లేదు. కూటమి ప్రభుత్వానికి మహిళల అండ ఉంది. మహిళల గౌరవాన్ని కాపాడే ప్రభుత్వంగా ముందుకు సాగుతాం' అని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు.

# కావలి కనకపట్నం కాబోతోంది

**నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - నియోజకవర్గం అభివృద్ధికి తిరుగు లేదు**

**స్థానిక ఎమ్మెల్యే డి వీ కృష్ణా రెడ్డితో కలసి పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎంపీ**



కావలి (సింధూరదర్శిని) 17 జూన్ నెల్లూరు జిల్లా; భవిష్యత్తులో కావలి కనకపట్నంగా రుజువు కాబోతోందని పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తో కలసి పట్టణంలో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను ప్రారంభించారు.పట్టణంలోని పోలేరమ్మ అరుగు నుండి కృష్ణుని బొమ్మ సెంటర్ వరకు నిధులు రూ.45 లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. అలాగే బాలకృష్ణారెడ్డి నగర్ నిధులు రూ.30లక్షలతో మంజూరైన సిమెంట్ రోడ్డునునిర్మాణాన్ని ప్రారంభించారు. పట్టణంలోని ఉదయగిరి రోడ్డు నుండి లేఔట్ వరకు ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా కోటి రూపాయల నిధులతో మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు.. పట్టణంలోని పెద్ద పవని రోడ్డు నుండి వెంకటేశ్వర థియేటర్ వరకుఆంధ్రప్రదేశ్ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా రూ.1. 30 కోట్ల రూపాయల నిధులతో మంజూరైన రోడ్డు విస్తరణ, వరవ కాలువపై శ్లాబులు ఏర్పాటు పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రానికి కష్టపడి పని చేసే నైజం కలిగిన విజనరీ నాయకులైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ , ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఉండడం మనందరి అదృష్టం అన్నారు. గత ప్రభుత్వంలో ఎన్ని రకాల ఇబ్బందులు పడ్డారో స్వయంగా మీరంతా చూశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమం కూడా చూశారన్నారు. దాన్ని గుర్తుపెట్టుకుని 2029లో తిరిగి మన ప్రభుత్వాన్ని నిర్మించుకోవాలన్నారు. కావలి ఎమ్మెల్యేగా కృష్ణారెడ్డిని తిరిగి గెలిపించుకోవాలన్నారు. నెల్లూరు ఎంపీగా తనను గెలిపించాలని కోరారు. మనందరం కలిసికట్టుగా పనిచేసి మరలా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు.ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కావలి అభివృద్దే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కావలిలో మూడుకోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో నిధులు మంజూరు చేయడం సులుభతరం కాదని .అయినా ఇంత మేరకు అభివృద్ధి చేయడం కావలి ప్రజల అదృష్టంఅన్నారు.ఇటీవల కావలి పర్యటనలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని ప్రత్యేకంగా ప్రశంసించారన్నారు. వారి పనితీరు బాగుందని మంచి కితాబు ఇచ్చారన్నారు. నియోజకవర్గంలో ప్రజలను సొంత మనుషులుగా భావించి పేరు గుర్తు పెట్టుకొని పిలవ గలిగే నైజం కలిగినవ్యక్తి ఎమ్మెల్యే అన్నారు. నిరంతరం ప్రజలకు సంక్షేమం,ప్రజాసేవ చేయాలని పరితపించే వ్యక్తి అన్నారు రాబోవు రెండు సంవత్సరాల్లో కావలి నియోజకవర్గం ఊహించిన విధంగా అభివృద్ధిలోకి దూసుకెళ్తుందన్నారు.మరో కొద్దినెలల్లో కావలి నియోజకవర్గంలో బీపీసీఎల్ పరిశ్రమ ప్రారంభం కాబోతోందన్నారు. రూ.90లక్షల కోట్ల భారీ పెట్టుబడులతో వివిధ రూపాలలో బీపీసీఎల్ పరిశ్రమ ప్రారంభం కావడం నియోజకవర్గ ప్రజలకు శుభపరిణామం అన్నారు. బీపీసీఎల్ పరిశ్రమకు తోడ్పాటుగా పలు పరిశ్రమలు స్థాపిస్తారన్నారు.నియోజకవర్గ ప్రజలకి ఏదో ఒక రూపంలో ఉపాధి ఉద్యోగ, వ్యాపార అవకాశాలు లభించడం ఖాయమన్నారు.

అలాగే జువ్వలదిన్నె ప్రాంతంలో మరో పరిశ్రమ ప్రారంభం కాబోతోంది అన్నారు. అందులో కూడా 800 మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలుంటాయన్నారు.దగదర్తి లో విమానాశ్రయ నిర్మాణం సంబంధించి టెండర్లు కూడా పిలిచారన్నారు. తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. అలాగే బిట్రగుంట రైల్వే జంక్షన్ ప్రాంతమును కూడా అభివృద్ధి లోకి తీసు కొచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. బిట్రగుంటలో దాదాపు 700 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉందన్నారు. అంత ప్రభుత్వ భూమి ఉండడం కావలి నియోజకవర్గం ప్రజలు అదృష్టం అన్నారు.ఆ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్కు, మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కు లు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కావలి చుట్టూ రామాయ పట్నం బీపీసీఎల్, విమానా శ్రయము, జువ్వలదిన్నె తదితర ప్రాంతాలు ఉండడంతో కావలి నియోజకవర్గ అభివృద్ధికి తిరుగు లేదన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి కావలిని అభివృద్ధి చేసిన విధంగా గతంలో ఎవరూ చేయలేదని భవిష్యత్తులో కూడా చేయలేరన్నారు.కావలి ప్రజలకు మంచి శాసన సభ్యులు ఉండడం అదృష్టం అన్నారు.కావలిలో జరిగిన అభివృద్ధి పనులు అత్యంత నాణ్యత ప్రమాణాలతో జరిగాయన్నారు. కావలిలో జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు.పట్టుదల కలిగిన,స్థానికులైన ఎమ్మెల్యేని ఎవరు వదులుకో కూడదన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

# యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం మానసిక ప్రశాంతత

**జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు -స్వర్ణాల చెరువులో సామూహిక యోగాకు విశేష స్పందన**

**ప్రతి ఒక్కరూ యోగా ను దినచర్యలో భాగం చేసుకోవాలి - జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు - ఆకట్టుకున్న విద్యార్థుల యోగా ప్రదర్శనలు**






నెల్లూరు( సింధూర దర్శిని) 17 జూన్ నెల్లూరు జిల్లా ; యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత సాధ్యమవుతాయని చాటి చెబుతూ నెల్లూరు నగరంలోని స్వర్ణాల చెరువు ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించిన సామూహిక యోగా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇరుగాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో నిర్వహించిన యోగా కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అధిక సంఖ్యలో యోగాభ్యాసకులు పాల్గొని యోగాసనాలు ఆచరించగా, స్వర్ణాల చెరువు పరిసరాలు యోగా సాధకులతో కళకళలాడాయి. జాయింట్ కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ దేవరకొండ సుజాత, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూలి భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప వరాలలో యోగా ఒకటని పేర్కొన్నారు. మనసును శరీరంతో అనుసంధానించే అద్భుత ప్రక్రియ యోగ అని అన్నారు. యోగాంధ్ర కార్యక్రమాలను జిల్లా నలుమూలలకు విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల దినచర్యలో యోగాను భాగం చేయడమే యోగాంధ్ర ప్రధాన లక్ష్యమని తెలిపారు. యోగా సాధన ద్వారా అనేక అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21న నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించనున్న భారీ సామూహిక యోగా కార్యక్రమం లో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయస్థాయి యోగా కోచ్, జడ్జి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాసనాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రతి ఆసనానికి ఉన్న ప్రత్యేక ప్రయోజనాలను వివరిస్తూ ఆమె చేసిన ప్రదర్శన యోగా పై పాల్గొన్న వారిలో మరింత ఆసక్తిని పెంచింది. అవెన్యూ, రెయిన్‌బో పాఠశాలల విద్యార్థులు హేమిత, తన్మయి, తన్వి, తేజ ప్రదర్శించిన యోగాసనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా గోల్డ్ మెడలిస్టులు ప్రసన్న, కావ్య, యోగాభ్యాసకులు నీరజ, తేజతో పాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జాయింట్ కలెక్టర్ ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో ఆయుష్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డా. ఎం శేఖర్ రాజు, ఐటిడిఏ పీవో శ్రీనివాసరావు, ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీనివాసరాజు, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ మాధురి, జిల్లా పర్యాటక శాఖ అధికారి అలీ అస్గర్, డీసీఓ గుర్రప్ప, డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# పాలకమండలితో ఆలయ ఈవో పెంచల కిషోర్ సమీక్ష సమావేశం



కాణిపాకం( సింధూర దర్శిని) 17 జూన్ చిత్తూరు జిల్లా; కాణిపాకం స్వయంభు శ్రీ కాణిపాక వరసిద్ధి వినాయక స్వామివారి దేవస్థానం కార్యనిర్వహణధికారి కార్యాలయం మీటింగ్ హాలు నందు బుధవారం పాలకమండలి సమావేశం నిర్వహించడం జరిగింది, చైర్మన్ మణి నాయుడు , దేవస్థానం ఈ.వో పెంచల కిషోర్ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించడం జరిగింది.మొదటిగా దేవస్థానం నందు పనిచేయు ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులకు పెద్దపీట వేస్తూ బోర్డు నిర్ణయం, ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తుల జీతభత్యాల పెంపు గురించి ఆమోదం తెలుపుత ఉద్యోగస్తుల సమస్యల గురించి తెలుసుకుని వారికి ఎలాంటి సమస్యలు లేకుండా చేయడం గురించి తరువాత అన్నదానం మరియు వినాయక సదన్ నూతన రూముల నందు సిబ్బంది కొరత కావడంతో సిబ్బంది పెంపు గురించి చర్చించారు, సిబ్బంది హెల్త్ ఇన్సూరెన్స్ లు, వార్షిక టెండర్లు గురించి చర్చించడం జరిగింది, మరియు లడ్డుపోటు లడ్డు నాణ్యత మరియు సరుకు నాణ్యత గురించి చర్చించడం జరిగింది, ఇంకా వివిధ ముఖ్య అంశాలపై సుదీర్ఘ చర్చలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డ్ సభ్యులు నాగరాజు నాయుడు, చంద్రశేఖర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, శివ ప్రసాద్, సుబ్రహ్మణ్యం రెడ్డి, చంద్రకళ, అనసూయ, వసంత, సునీత, రాజ్యలక్ష్మి, కృష్ణవేణి, పద్మలత, శ్రీవాణి ఏఈఓ లు ప్రసాద్, ఎస్వీ కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, ధనంజయ, సిఎఫ్ఓ నాగేశ్వరరావు, సూపరిటెండెంట్లు కోదండపాణి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ

**జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్**

**విద్యార్థినులకు మెరుగైన వసతులు, నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలి**



నాయుడుపేట (సింధూరదర్శిని)17జూన్ తిరుపతి జిల్లా; నాయుడుపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వసతి గృహంలోని మౌలిక వసతులను క్షుణ్ణంగా పరిశీలించిన కలెక్టర్, విద్యార్థినులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్ల మరమ్మత్తులు, నిరంతర తాగునీటి సరఫరా, ప్రతి కొళాయికి ట్యాపుల ఏర్పాటు, ట్యూబ్‌లైట్లు, ఎలక్ట్రికల్ వైరింగ్, ఎల్ఈడీ బల్బుల అమరిక, వంటగదిలో ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఏర్పాటు, స్టోర్‌రూమ్‌కు మెష్ ఏర్పాటు, కిటికీలకు దోమల నివారణ మెష్‌లు, తలుపుల మరమ్మత్తులు, గదుల్లో లీకేజీల నివారణ, ఫ్లోరింగ్ పనులు, ఆర్ఓ త్రాగునీటి ప్లాంట్ వంటి అంశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

విద్యార్థినులకు నాణ్యమైన, పోషకాహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వసతి గృహ అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడి హాస్టల్‌లో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. అందరూ క్రమశిక్షణతో చదువుకొని మంచి ఫలితాలు సాధించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థినులను ప్రోత్సహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలు, గురుకుల విద్యాసంస్థల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కనీస మౌలిక వసతుల కల్పన, మరమ్మత్తు పనుల కోసం ప్రత్యేక నిధులు కేటాయించిన నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా వినియోగించి నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. నిర్మాణ, మరమ్మత్తు పనుల్లో నాసిరకం మెటీరియల్‌ను ఉపయోగించరాదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి హరీష్, నాయుడుపేట తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పజిలుల్లా, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, అసిస్టెంట్ సాంఘిక సంక్షేమ అధికారిణి లక్ష్మీరాజ్యం, వార్డెన్లు సరిత, ఉమ, సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు నెల్లూరులో ప్రత్యేక గ్రీవెన్స్ డే

**ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ డే**

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



నెల్లూరు ( సింధూర దర్శిని) 17 జూన్ నెల్లూరు జిల్లా; ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు గురువారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ డే ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ఈనెల 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు, సంఘాలకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు, సంఘాలు తమ సమస్యలు, వినతులను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావడానికి ఈ ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ముందస్తుగా ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు, సంఘాలకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

# దొంగతనం కేసులో ముద్దాయిలు అరెస్ట్

గూడూరు (సింధూర దర్శిని) 17 జూన్ నెల్లూరు జిల్లా ; దొంగతనం కేసులో ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు చిల్లకూరు పోలీస్ స్టేషన్ నందు నమోదు కాపాడిన ట్రాన్స్ఫార్మర్ దొంగతనం కేసులో గూడూరు రూరల్ మండలం వెన్నోడు గ్రామానికి చెందిన 1. గుంజి శ్రీహరి 2. వన్నెరు విజయ్ కుమార్,3. యనమల హరికృష్ణ లను ఎస్ ఐ అరెస్ట్ చేసి గూడూరు కోర్ట్ నందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా కోర్టు వారు ముగ్గురు ముద్దాయిలకు 14 రోజుల రిమాండ్ విధించారు అని తెలిపారు.

# రోడ్డు పనులు నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ డా. ఎస్.వేంకటేశ్వర్




నాయుడుపేట (సింధూర దర్శిని) 17 జూన్ తిరుపతి జిల్లా; వర్షపు నీటిని ప్రతి బొట్టును సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడే విధంగా చెరువులు, కాలువలు, నీటి వనరులను పునరుద్ధరించడమే జలధార – జలహారతి లక్ష్యమని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వేంకటేశ్వర్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జలధార–జలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీతో కలిసి నాయుడుపేట మండలంలోని పాలచూరు క్యాస్కేడింగ్ సిస్టమ్‌లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాలచూరు సిస్టమ్‌లో స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతానికి అనుసంధానంగా సుమారు 23 కిలోమీటర్ల మేర విస్తరించిన 12 చెరువులు ఉన్నాయని, ఈ చెరువుల ద్వారా సుమారు 6,000 ఎకరాల ఆయకట్టు సాగునీటి సౌకర్యాన్ని పొందుతోందన్నారు. జలధార -- జలహారతి కార్యక్రమం ద్వారా ఇరిగేషన్ శాఖ చేపడుతున్న పనులకు ఎన్ ఆర్ ఈ జి ఎస్ పనులను అనుసంధానం చేస్తూ సమన్వయంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి వర్షపు నీటి బొట్టును సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయ అవసరాలకు ఉపయోగపడే విధంగా చెరువులు, కాలువలు, నీటి వనరులను పునరుద్ధరించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో వ్యవసాయ పరంగా అత్యంత ప్రాధాన్యత కలిగిన సూళ్లూరుపేట, సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో జలహారతి పనులు విస్తృతంగా కొనసాగుతున్నాయన్నారు. ముఖ్యంగా నాయుడుపేట మండలంలోని పాలచూరు సిస్టమ్ పరిధిలో జరుగుతున్న పనుల పురోగతిని ఎమ్మెల్యేతో కలిసి పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు జలధార – – జలహారతి కార్యక్రమం కింద సుమారు 3,360 పనులు చేపట్టినట్లు కలెక్టర్ వెల్లడించారు. వీటిలో సప్లై ఛానళ్ల మరమ్మతులు, చెరువుల్లో పొదలు మరియు కలుపు మొక్కల తొలగింపు, క్యాస్కేడింగ్ సిస్టమ్స్ అనుసంధానం, అలుగుల మరమ్మతులు, దెబ్బతిన్న నీటి వనరుల పునరుద్ధరణ వంటి అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా చెరువులు నిండడంతో భూగర్భ జలమట్టాలు పెరగడంతో పాటు ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అలాగే పశుసంపద అభివృద్ధికి అవసరమైన నీటి లభ్యత పెరిగి పాడి పరిశ్రమకు ప్రోత్సాహం లభిస్తుందని, రైతుల ఆదాయం పెరగడానికి దోహదపడుతుందని వివరించారు. సాగుభూముల్లో ఉత్పత్తి, ఉత్పాదకత రెండూ పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం కారణంగా రానున్న కాలంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్న నేపథ్యంలో, ముందస్తు చర్యగా రాష్ట్ర ప్రభుత్వం జలధార -- జలహారతి కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. నీటి వనరులను సంరక్షించి, భవిష్యత్తు వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం నాయుడుపేట – వెంకటగిరి విసిఐసి రోడ్డు పనులను సూళ్లూరుపేట ఎంఎల్‌ఏతో కలసి పరిశీలించి, రోడ్డు పనులను నిర్దేశించిన సమయం లోపు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి మద్దిలేటి, ఇరిగేషన్ ఎస్ఇ రాధాకృష్ణ, ఏపిఐఐసి జెడ్ ఎం.భరత్ కుమార్ రెడ్డి, నాయుడుపేట ఆర్ అండ్ బి డిఈ పరమేశ్వరి, నాయుడు పేట తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ రాజేంద్ర, ఇరిగేషన్ ఇఇ బాబు, డిఇ విశ్వనాథ్, ఏఇ శ్రీనివాసులు, ఏపిఓ ఎన్‌ఆర్‌ఈజిఎస్ ఎం.భానుప్రియ, జేఇ నాగభూషణం, అధికారులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టం ప్రకారం 25% ఉచిత విద్య ఇవ్వని స్కూల్స్ పై చర్యలు తీసుకువాలి

### జిల్లా ఇంచార్జి మంత్రి సవితాకి వినతిపత్రం ఇచ్చిన AIBSU రాష్ట్ర అధ్యక్షులు జగన్ రాథోడ్

కడప, (సింధూర దర్శిని): జిల్లా లోని కార్పొరేట్, ప్రయివేట్ స్కూల్స్ విద్య హక్కు చట్టం ప్రకారం 25% ఉచితంగా సీట్లు ఇవ్వకుండా వున్నా వాటి పై చర్యలు తీసుకోవాలని ొా×దీూఖ రాష్ట్ర అధ్యక్షులు జగన్ రాథోడ్ అన్నారు. బుధవారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జిల్లా ఇంచార్జి మంత్రి సవిత గారిని కలిసి ప్రయివేట్ కార్పొరేట్ స్కూల్స్ పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతు విద్యా హక్కు చట్టం అమలులో ప్రధానగా డిఇఓ షంసుద్దీన్ నిర్లక్ష్యం ఉండన్నారు. ఈ చట్టం అమలు పై ఇ ఒక్క స్కూల్ కూడా తనిఖీ చేయలేదని అన్నారు. ఇవే కాకుండా కడప జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్ కార్పొరేట్ స్కూల్స్ ఈ విద్యా సంవత్సరం విపరీతంగా ఫీజులు పెంచారన్నారు. వాటి కట్టడి చేయాలని, ఇప్పటికే ఒక్కో విద్యార్థి దగ్గర లక్ష రూపాయల వసూలుకు స్కూల్ యాజమాన్యం లి సిద్ధమాయ్యన్నారు. అధిక స్కూల్ ఫీజులు, పుస్తకాలు, యూనిఫామ్ రవాణా ఛార్జ్ లంటూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచులోంటున్నారానర్.. ఇంత జరుగుతున్న ప్రధాన భాద్యుడుగా వున్నా డిఇఓ షంసుద్దీన్ మాత్రం ఏ ఒక్క స్కూల్ తనిఖీ చేయలేదని, ఆయన పైన విచారన చేసి చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా విద్యా హక్కు చట్టం పాటించని స్కూల్స్ పైన చర్యలకు తీసుకువాలని కోరారు.



# కూటమి ప్రభుత్వం రెండేళ్ల విజయోత్సవ సభ

గూడూరు( సింధూరదర్శిని) 17 జూన్ నెల్లూరు జిల్లా; ఎన్డీఏ కూటమి రెండేళ్ల పాలనలో నియోజకవర్గం విజయోత్సవ సభా కార్యక్రమంలో భాగంగా బుధవారం గూడూరు పివిఆర్ కళ్యాణ మండపంలో విజయోత్సవ సంబరాలను ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్లమెంటు అధ్యక్షులు పనబాక లక్ష్మి, నియోజకవర్గం పరిశీలకులు లక్ష్మీ ప్రసన్న పాల్గొన్నారు. వీరికి ముందుగా పూల బొకే అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో నియోజకవర్గంలో చేసిన సంక్షేమం , అభివృద్ధి కార్యక్రమాలను నాయకులకు కార్యకర్తలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పెంచలకోన మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తానంకి నానాజీ, శీలం కిరణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మట్టం శ్రావణిరెడ్డి, పులిమి శ్రీనివాసులు, భాస్కర్ రెడ్డి, చెంచురామయ్య, ఇజ్రాయిల్ కుమార్, అబ్దుల్ రహీం, దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, ఆడిటర్ రామచంద్రరావు, గుండాల లీలావతి, ముని శేఖర్ గౌడ్, చిరంజీవి, తదితర నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**

**ముఖ్య అతిథులుగా పార్లమెంట్ అధ్యక్షులు పనబాక లక్ష్మి, నియోజకవర్గం పరిశీలకులు లక్ష్మీ ప్రసన్న**

**ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలతో ఘన నివాళులు**



# తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు

**ప్రకృతి వ్యవసాయ రైతు పొలాన్ని సందర్శించిన కలెక్టర్ – కలెక్టర్, ఎమ్మెల్యే చేతుల మీదుగా విత్తన గుళికల తయారీ**

**రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అవగాహన – ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకం–జిల్లా కలెక్టర్ డా. ఎస్. వేంకటేశ్వర్**





శ్రీకాళహస్తి (సింధూర దర్శిని) 17 జూన్ తిరుపతి జిల్లా; ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తృతంగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను అందించే ప్రకృతి వ్యవసాయ విధానాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. బుధవారం శ్రీకాళహస్తి మండలం వేడం గ్రామానికి చెందిన ప్రకృతి వ్యవసాయ రైతు ఎ. పుష్పకు చెందిన మూడు ఎకరాల వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయంలో కీలకమైన విత్తన గుళికల తయారీ విధానం, దాని ప్రయోజనాలు, తయారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ స్వయంగా ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, బూడిద మరియు విత్తనాలను కలిపి విత్తన గుళికలను తయారు చేశారు. అనంతరం రైతు పుష్ప పొలంలో విత్తన గుళికలను బ్రాడ్‌కాస్టింగ్ పద్ధతిలో చల్లి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు పుష్పతో మాట్లాడిన జిల్లా కలెక్టర్ పశుగ్రాసం లభ్యత, నేల సారం పెంపు, ప్రకృతి వ్యవసాయం ద్వారా ఉత్పత్తి వ్యయాల తగ్గింపు, రైతులకు కలుగుతున్న ఆర్థిక ప్రయోజనాల పై ఆరా తీశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నేల ఆరోగ్యం మెరుగు పడటంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పాటునిస్తుందని పేర్కొన్నారు. అనంతరం యూరియా పంపిణీ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఎరువుల నిల్వల వివరాలను తెలుసుకోవాలని సూచించారు. అవసరమైన యూరియాను ముందస్తుగా యాప్ ద్వారా బుక్ చేసుకోవడం ద్వారా సమీప ఎరువుల దుకాణాలలో అందుబాటులో ఉన్న ఎరువులు పొందవచ్చని తెలిపారు. జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి మడక సహాయంతో క్రమ పద్ధతిలో వరుసల వారీగా విత్తనాలను జిల్లా కలెక్టర్ నాటారు. అనంతరం రైతు పుష్ప వరి పొలంలో జిల్లా కలెక్టర్, ఎంఎల్‌ఏ లు రైతులతో కలసి హ్యాండ్ ట్రాన్స్‌ప్లాంటర్ సహాయంతో వరి నాట్లు వేసి వ్యవసాయ పనులు నిర్వహించారు. రైతుల శ్రమను తగ్గించడంతో పాటు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో నాట్లు వేయడానికి హ్యాండ్ ట్రాన్స్‌ప్లాంటర్ వంటి వ్యవసాయ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ ద్వారా ఖర్చులు తగ్గి ఉత్పాదకత పెరుగుతుందని ఎం ఎల్ ఏ పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు రైతులకు మొబైల్ యాప్ వినియోగ విధానం, ఎరువుల బుకింగ్ ప్రక్రియ, యూరియా లభ్యతపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెంచయ్య నాయుడు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు, జిల్లా అదనపు వ్యవసాయ సంచాలకులు ధనుంజయ రెడ్డి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, ఏ.డి.ఏ. రమేష్ రెడ్డి, సహాయ వ్యవసాయ సంచాలకులు సూర్యప్రకాశ్ రెడ్డి, వ్యవసాయ అధికారి మమత, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పట్టాభిరెడ్డి, తహసీల్దార్, ఎంపీడీవోలు, ఏపీఓలు, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది, శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల ఇన్‌చార్జీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# ఎస్వీ మావుళ్ళమ్మ ఎనర్జీ స్టేషన్ ప్రారంభం



భీమవరం, సింధూరదర్శిని: భీమవరం బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్వీ మావుళ్ళమ్మ ఎనర్జీ స్టేషన్ (ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్)ను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు), డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భీమవరం పట్టణం వేగంగా అభివృద్ధి చెందుతూ కొత్త వ్యాపార అవకాశాలకు కేంద్రంగా మారుతోందని అన్నారు. పెట్రోల్ బంక్ నిర్వాహకులు కఠారి రవిశంకర్, పాడల వెంకటేశ్వరరావు, కఠారి ప్రభాకర్ మాట్లాడుతూ బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఈ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

# పోరుమామిళ్ల ఉప మార్కెట్ యార్డ్ త్వరలోపూర్తి

## బద్వేల్ ఏఎంసి నారిసెట్టి సుప్రజ



బద్వేల్ సింధూరదర్శిని: కడప జిల్లా బద్వేల్, పోరుమామిళ్ల ప్రాంతాల్లో రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించే దిశగా కీలక సమావేశం జరిగింది. బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నారిశెట్టి సుప్రజ, నాగేంద్రలు మార్కెటింగ్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులను కలిసి పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌కు సంబంధించిన సమస్యలు, పోరుమామిళ్లలో రైతు బజార్ ఏర్పాటు, బద్వేల్ రైతు బజార్ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేపట్టే అంశాలపై చర్చించారు. అలాగే నిర్మాణంలో ఉన్న పోరుమామిళ్ల ఉప మార్కెట్ యార్డ్‌ను త్వరలో పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా బద్వేల్ మార్కెట్ యార్డ్‌లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి ఆదాయ వనరులను పెంచడంతో పాటు రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే అంశాన్ని కూడా ప్రస్తావించారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా ఈ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు.

# ఆర్డీఎంఏను కలిసిన బాపట్ల మున్సిపల్ కమిషనర్ హాసిని




బాపట్ల సింధూరదర్శిని: గుంటూరులోని ప్రాంతీయ మున్సిపల్ పరిపాలన ఉపసంచాలకులు (ఆర్డీఎంఏ) ఎస్. హరికృష్ణను బాపట్ల మున్సిపల్ కమిషనర్ శ్రీమతి ఎం. హాసిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన హాసినికి ఈ సందర్భంగా ఆర్డీఎంఏ హరికృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో సమర్థవంతంగా పనిచేస్తూ మున్సిపల్ పరిపాలనను మరింత బలోపేతం చేయాలని సూచించారు. పట్టణంలో పారిశుధ్య ప్రమాణాలను ఉన్నత స్థాయిలో నిర్వహించడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, ప్రజలకు నాణ్యమైన పౌర సేవలను సకాలంలో అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని కమిషనర్‌కు ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజాకేంద్రీకృత పాలన, పరిపాలనా సామర్థ్య పెంపు, పట్టణాభివృద్ధి లక్ష్యాల సాధనకు సంబంధించిన పలు అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది.

# 150 గ్రామాల్లో అంధకారం

## విద్యుత్ కోతతో అల్లాడిన వృద్ధులు

### గాలి ఆడక చిన్నారుల అవస్థలు లోడ్ రిలీజింగ్ పేరుతో విద్యుత్ కోత

ఇంకొల్లు సింధూరదర్శిని: 132 కెవి సబ్ స్టేషన్ పరిధిలో సుమారు 150 గ్రామాలు లో అన్న కారం నెలకొంది వేసవిలో లోడ్ రిలీజింగ్ పేరుతో 10:00 నుండి 11:30 వరకు విద్యుత్ కోత విధించడంతో ఆయా గ్రామాల్లో అంధకారం నెలకొంది దీంతో వృద్ధులు చిన్నారులు గాలి ఆడక అవస్థలు పడ్డారు ఇది కాకుండా అర్ధరాత్రి వేళ సమయపాలన లేకుండా అప్రకటిత విద్యుత్ కోతలు విధిస్తుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు ఈ విషయమై ఇంకొల్లు 132 కెవి అధికారులను వివరణ కోరగా మరో అరగంటకు విద్యుత్తు వస్తుందని అధికారులు తెలియజేశారు ఇంకొల్లు 132 కెవి పరిధిలో ఐదు ఫీడర్లు ఉన్నాయి ఐదు ఫీట్లలో విద్యుత్తు నిలిపివేయడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు ఇప్పటికైనా ఇటువంటి సమస్య లేకుండా చూడాలని ప్రజలు అధికారులు కోరుతున్నారు.



# పుట్టవారిపాలెం జంక్షన్‌లో భారీ ట్రాఫిక్ జామ్

**గంటకు పైగా నిలిచిపోయిన వాహనాలు**
**సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలంటూ ప్రజల విజ్ఞప్తి**



అద్దంకి సింధూరదర్శిని: సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం జంక్షన్‌లో బుధవారం ఉదయం భారీ ట్రాఫిక్ సమస్య నెలకొంది. గుంటూరు-కర్నూలు, నార్కట్‌పల్లి-అద్దంకి ప్రధాన రహదారుల కూడలి కావడంతో గంటకు పైగా వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొన్నారు. పాఠశాలలు ప్రారంభం కావడం, వ్యాపార కార్యకలాపాలు మొదలవడం, వివిధ శుభకార్యాలకు బుధవారం మంచి రోజు కావడంతో ఒకేసారి పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి రావడం ట్రాఫిక్ రద్దీకి ప్రధాన కారణంగా కనిపించింది. లారీలు, బస్సులు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు భారీగా రావడంతో జంక్షన్ నాలుగు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. కొన్ని మార్గాల్లో రెండు కిలోమీటర్లకు పైగా వాహనాల క్యూలు కనిపించాయి.

**ట్రాఫిక్ నియంత్రణలో సిబ్బంది కొరత**

పుట్టవారిపాలెం జంక్షన్‌కు సమీపంలో సర్కిల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ ఉన్నప్పటికీ ట్రాఫిక్ నియంత్రణకు తగిన సిబ్బంది అందుబాటులో లేకపోవడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మార్చిందని స్థానికులు పేర్కొన్నారు. ప్రస్తుతం పోలీసు సిబ్బంది ఇతర విధుల్లో నిమగ్నమవుతున్నందున ప్రత్యేక ట్రాఫిక్ డ్యూటీలకు సిబ్బంది కొరత ఉందని తెలుస్తోంది.

**శాశ్వత పరిష్కారంపై ప్రజల డిమాండ్**

పుట్టవారిపాలెం జంక్షన్ జిల్లాలో అత్యంత రద్దీ కూడళ్లలో ఒకటిగా మారిందని స్థానికులు చెబుతున్నారు. రహదారుల విస్తరణతో పాటు ఆధునిక ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, రద్దీ సమయాల్లో ప్రత్యేక ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు. రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో తక్షణ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

**సత్వర స్పందనతో ట్రాఫిక్ క్లియర్**

పుట్టవారిపాలెం జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్ విషయం తెలుసుకున్న సంతమాగులూరు సీఐ శేషగిరిరావు తక్షణమే పోలీసు సిబ్బందిని ట్రాఫిక్ నియంత్రణ విధులకు పంపించారు. సిబ్బంది రంగంలోకి దిగి వాహనాలను క్రమబద్ధీకరించడంతో కొద్ది సేపట్లోనే ట్రాఫిక్ జామ్ పూర్తిగా క్లియర్ అయింది. గంటకు పైగా ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బందులు పడిన ప్రయాణికులు, వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. సమస్యను గుర్తించి వెంటనే చర్యలు చేపట్టిన సీఐ శేషగిరిరావు, ఎస్సై పట్టాభిరామయ్యలను స్థానికులు, ప్రయాణికులు అభినందించారు.

**ప్రమాదాలకు కూడా కారణమవుతున్న రద్దీ**

ఈ కూడలిలో తరచూ ట్రాఫిక్ నిలిచిపోవడంతో పాటు ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా పాఠశాల విద్యార్థులు, వృద్ధులు రోడ్డు దాటే సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ట్రాఫిక్ నిర్వహణకు శాశ్వత ప్రణాళిక అవసరమని కోరుతున్నారు.

# కాలేజీ టైమింగ్స్ మార్పుపై విద్యార్థుల ఆందోళన



బాపట్ల సింధూరదర్శిని: కాలేజీ పని వేళలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిరాహార దీక్ష చేపట్టి తమ నిరసనను వ్యక్తం చేశారు. గత 30 ఏళ్లుగా కళాశాలలో ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తుండగా, ఈ విద్యా సంవత్సరం నుంచి ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొత్త సమయాలను అమలు చేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. ఈ మార్పు వల్ల చదువుకు, పోటీ పరీక్షల సన్నాహకానికి తగిన సమయం దొరకడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాత టైమింగ్స్‌ను కొనసాగించాలని పలుమార్లు యాజమాన్యాన్ని కోరినప్పటికీ స్పందన రాలేదని ఆరోపించిన విద్యార్థులు, తరగతులను బహిష్కరించి రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. కళాశాల సమయాలను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ యాజమాన్యానికి తమ విజ్ఞప్తిని మరోసారి వినిపించారు. తమ డిమాండ్లను యాజమాన్యం అంగీకరించకపోతే రాబోయే రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని విద్యార్థులు హెచ్చరించారు. విద్యార్థుల నిరసనతో కళాశాల పరిసరాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# వ్యవసాయ కళాశాల హాస్టళ్లలో దోమల నివారణ చర్యల పరిశీలన




బాపట్ల సింధూరదర్శిని: బాపట్ల జిల్లా మలేరియా అధికారి వి.నాగార్జునరావు బాపట్ల ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో పీజీ విద్యార్థుల హాస్టల్ గదుల్లో నిర్వహిస్తున్న ఆల్ఫాసైపర్‌మిత్రిన్ 5 శాతం ద్రావణం పిచికారీ కార్యక్రమాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ కళాశాలల హాస్టళ్లలో దోమల నివారణ కోసం క్రిమిసంహారక మందుల పిచికారీ చేపడుతున్నట్లు తెలిపారు. మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి కీటక జనిత వ్యాధుల నివారణకు ఈ చర్యలు దోహదపడతాయన్నారు. కళాశాల ప్రాంగణంలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, పొదలు, గడ్డి ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. లార్వా పెరిగే అవకాశమున్న ప్రాంతాలను గుర్తించి వెంటనే నిర్మూలించాలని తెలిపారు. అనంతరం కళాశాల హెచ్‌వోడీ డా. కె.కిరణ్ ప్రకాష్‌తో సమావేశమైన జిల్లా మలేరియా అధికారి, దోమల నివారణ చర్యలు, క్రిమిసంహారక మందుల వినియోగం, విద్యార్థులకు కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఎండి. షకీల్, మలేరియా పట్టణ సూపర్వైజర్ రాంబాబు, ఆరోగ్య కార్యకర్త పి. శేషగిరిరావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అనుమతి లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి**




కడప సింధూరదర్శిని: జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమ తులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బుధవారం కడప ఐజూ కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ కి అందించిన ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జిల్లా వ్యాప్తంగా చదువు అనే పేరుతో గుర్తింపు లేని విద్యాసంస్థలు నడుపుతున్న యాజమాన్యాలు చాలా ఉన్నాయి.అలాగే ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా చదువుతో వ్యాపారం చేస్తున్న విద్యాసంస్థల చర్యలు తీసుకోవాలని అనేక మార్లు చెప్పడం జరిగిందని వారన్నారు. జిల్లా వ్యాప్తంగా పుట్టగొడుగులు లాగా ప్రైవేట్ మరియు కార్పొరేట్ పాఠశాలలు మరియు, కోచింగ్ సెంటర్ల ముందస్తు అడ్మిషన్ల పేరుతో వేల,లక్షలు తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారని వారన్నారు. ఇప్పటికైనా గుర్తింపు లేని విద్యాసంస్థలను వెంటనే సీజ్ చేయాలని లేని పక్షంలో రాబోవు రోజుల్లో ఎస్ఎఫ్ఐ కడప జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వాటిని అడ్డుకొని రాజీలేని పోరాటాలు చేస్తామని విన్నపించడం జరిగిందని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు ఓంకార్, అభి తదితరులు పాల్గొన్నారు.



# పారిశుధ్య, అభివృద్ధి పనులపై కమిషనర్ హాసిని ఆకస్మిక తనిఖీలు

బాపట్ల సింధూరదర్శిని: బాపట్ల పట్టణంలో జరుగుతున్న పారిశుధ్య, అభివృద్ధి పనులను మునిసిపల్ కమిషనర్ శ్రీమతి ఎం. హాసిని బుధవారం పరిశీలించారు. పలు వార్డుల్లో పర్యటించిన ఆమె, పనుల పురోగతిని తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. కర్లపాలెం రోడ్డులోని డివైడర్లలో పెరిగిన కలుపు మొక్కల తొలగింపు పనులను పరిశీలించిన కమిషనర్, డివైడర్లను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, సుందరంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. జగన్నాథపురం మెయిన్ రోడ్డులోని శ్రీనివాస మహల్ సమీపంలో గృహాల నుంచి చెత్త వ్యర్థాల వేరు చేసే ప్రక్రియను, పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా సేకరించి శాస్త్రీయ విధానంలో నిర్వహించాలని, పట్టణ పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పారిశుధ్య విభాగ అధికారులకు సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న మునిసిపల్ పెట్రోల్ బంక్ పనులను పరిశీలించిన కమిషనర్, నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పట్టణ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం లేకుండా పనిచేయాలని సంబంధితశాఖల అధికారులకు సూచించారు.

# ధ్యానము యోగ నిత్యము చేయడం అలవర్చుకోవాలి : తహసిల్దార్



ఇంకొల్లు సింధూరదర్శిని: నిత్య వ్యాయామంతో ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతుందని తహసిల్దారు ఏవిఎస్ శ్రీనివాస్ అన్నారు. ఇంకొల్లు రోటరీక్లబ్ ఆవరణలో ఐసిడిఎస్ సిబ్బందికి ధ్యానము, యోగ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శ్వాస మీద ధ్యానము ఏకాగ్రతతో చేస్తే వాటి ఫలితాలు ఎంతో అద్భుతంగా ఉంటాయని ఆయన అన్నారు. యోగా చేయడం వల్ల శరీరంకు ఎంతో వ్యాయామం చేసినట్లుగా ఉంటుందని అన్నారు. నేటి ఆహారపు అలవాట్లలో యోగ ఎంతో అవసరమని ఆయన సిబ్బందికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ సులోచన రాణి ఐసిడిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె మృతి

ఇంకొల్లు సింధూరదర్శిని: ఇంకొల్లు మండల పరిధిలోని నక్క వాగు సమీపంలో గుర్తుతెలియని వాహనము ఢీకొని సుమారు 50 వేల రూపాయలు విలువైన గేదె మృతి చెందింది నిత్యము పాత మద్రాసు రహదారిలో వాహనాలు ప్రతిగా తిరుగుతూ ఉంటాయి. ఈ రహదారిలో టోల్గేట్ లేకపోవడంతో హైవే మీద వెళ్లే వాహనాలు కూడా కొన్ని ఇటు నడుస్తూ ఉంటాయి.



# అన్నం వండే ముందు బియ్యం కడగడం మంచిదా? కాదా?

బియ్యం కడగడం వల్ల అదనపు పిండిపదార్థం, మైక్రోప్లాస్టిక్స్ తొలగిపోతాయి
స్వల్పంగా పోషకాలు నష్టపోయే అవకాశం ఉందని వెల్లడి
ఆర్సెనిక్ తగ్గాలంటే కడగడం కన్నా గంజి వార్చడమే ఉత్తమమని సూచన


అన్నం వండే ముందు బియ్యాన్ని కడగడం దాదాపు అన్ని ఇళ్లలోనూ ఉండే సాధారణ అలవాటు. అయితే ఈ పద్ధతి వల్ల కలిగే లాభనష్టాలపై నిపుణులు కీలక విషయాలను వెల్లడించారు. బియ్యాన్ని కడగడం వల్ల అన్నం పొడి పొడిగా రావడమే కాకుండా, కొన్ని రకాల కాలుష్య కారకాలు కూడా తొలగిపోతాయని వారు చెబుతున్నారు. అదే సమయంలో, స్వల్ప మొత్తంలో పోషకాలు నష్టపోయే అవకాశం ఉందని కూడా వివరిస్తున్నారు. ఆస్ట్రేలియాలోని అడిలైడ్ యూనివర్సిటీకి చెందిన ఆహార శాస్త్రవేత్తల ప్రకారం, బియ్యంపై ఉండే అదనపు పిండి పదార్థం (స్టార్చ్) కడగడం ద్వారా తొలగిపోతుంది. దీనివల్ల అన్నం అతుక్కోకుండా పొడిపొడిగా వస్తుంది. సాగు సమయంలో నీరు, నేల ద్వారా బియ్యానికి చేరే ఆర్సెనిక్ వంటి హానికారకాలు కూడా కొంతవరకు తొలగిపోతాయని ఆహార శాస్త్రవేత్త పర్మల్ డియో తెలిపారు. 2021లో జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, బియ్యాన్ని కడగడం వల్ల 20 నుంచి 40 శాతం వరకు మైక్రోప్లాస్టిక్స్ కూడా తగ్గుతాయని తేలింది. అయితే, బియ్యాన్ని కడిగే క్రమంలో కాపర్, ఐరన్, జింక్ వంటి నీటిలో కరిగే కొన్ని పోషకా లను కూడా కోల్పోయే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటు న్నారు.



అయితే, సమతుల్య ఆహారం తీసుకునే వారికి ఈ నష్టం చాలా స్వల్పమని, దీనివల్ల ఆరోగ్యానికి పెద్దగా ఇబ్బంది ఉండదని డైటీషియన్ ఇవాంజెలిన్ మాంట్జి యోరిస్ స్పష్టం చేశారు. ప్రస్తుత సూపర్ మార్కెట్లలో లభించే బియ్యం ఇప్పటికే శుద్ధి చేసి వస్తుండటంతో, కేవలం రుచి లేదా కాలుష్యాల తొలగింపు కోసమే కడగాల్సి ఉంటుందని మరో శాస్త్రవేత్త బో వాంగ్ వివరించారు. నిపుణుల సలహా ప్రకారం, రుచి కోసం ఒకటి లేదా రెండు సార్లు బియ్యాన్ని సున్నితంగా కడగడం ఉత్తమం. దీనివల్ల పోషక నష్టం పెద్దగా జరగదు. ఆర్సెనిక్ వంటి హానికారకాల పట్ల ఆందోళన ఉన్నవారు, బియ్యాన్ని కడగడంతో పాటు ఎక్కువ నీటిలో ఉడికించి, గంజిని వార్చివేయడం మేలని శాస్త్రీయ అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఈ పద్ధతి ద్వారా ఆర్సెనిక్ శాతాన్ని 40 నుంచి 60 శాతం వరకు తగ్గించవచ్చని తేలింది.

# వెజ్ క్యాంటీన్‌లో కోడిగుడ్లు.. అహ్మదాబాద్ ఇంజినీరింగ్ కాలేజీలో వివాదం

- అహ్మదాబాద్ ఇంజినీరింగ్ కాలేజీలో కోడిగుడ్ల వివాదం
- శాకాహార క్యాంటీన్‌లో ఆమ్లెట్లు అమ్ముతున్నారని విద్యార్థుల ఫిర్యాదు
- క్యాంటీన్ ఆపరేటర్‌కు నోటీసులు జారీ చేసిన యాజమాన్యం
- మరోసారి పునరావృతమైతే కాంట్రాక్ట్ రద్దు చేస్తామని హెచ్చరిక
- ప్రస్తుతానికి కోడిగుడ్ల ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేత



గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఉన్న ప్రముఖ ప్రభుత్వ ఇంజినీరింగ్ విద్యాసంస్థ 'ఎల్డీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్'లో వివాదం చోటుచేసుకుంది. 'పూర్తి శాకాహారం' నిబంధనతో నడుస్తున్న క్యాంటీన్‌లో ఆమ్లెట్లు, ఉడికించిన కోడిగుడ్లు విక్రయిస్తున్నారని విద్యార్థులు ఫిర్యాదు చేయడంతో ఈ వివాదం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై స్పందించిన కళాశాల యాజమాన్యం, క్యాంటీన్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేసింది. క్యాంటీన్‌లో కోడిగుడ్ల విక్రయం తమ మతపరమైన, సాంస్కృతిక మరియు వ్యక్తిగత మనోభావాలను దెబ్బతీస్తోందని విద్యార్థులు ఆరోపించారు. శాకాహార పదార్థాలకు, కోడిగుడ్లతో తయారు చేసే వంటకాలకు ఒకే రకమైన పాత్రలను ఉపయోగిస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు గుజరాత్ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జీటీయూ) వైస్ ఛాన్సలర్‌కు విద్యార్థులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అందిన ఫిర్యాదులపై విచారణ జరిపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నిలయ్ భూప్తాని తెలిపారు. క్యాంటీన్ నిర్వాహకుడిని తీవ్రంగా హెచ్చరించామని, భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతమైతే కాంట్రాక్టును రద్దు చేస్తామని స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. నెలన్నర క్రితం కూడా ఇలాంటి ఫిర్యాదులు రావడంతో అప్పట్లో ఒకసారి నోటీసు జారీ చేశామని వెల్లడించారు. క్యాంటీన్‌లో పరిస్థితులను పర్యవేక్షించేందుకు అధ్యాపకులతో ఆకస్మిక తనిఖీలు (స్పాట్ చెక్స్) నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

ప్రస్తుతానికి క్యాంటీన్‌లో కోడిగుడ్లకు సంబంధించిన ఉత్పత్తుల అమ్మకాలను నిలిపివేశారు. సుమారు 7,000 మంది విద్యార్థులు ఉన్న ఈ విద్యాసంస్థ క్యాంటీన్‌లో ఆహార నాణ్యత, పరిశుభ్రతపై కూడా పలువురు విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# ఆహారపు అలవాట్లు మార్చుకోండి మానసిక ఒత్తిడి లేకుండా ఉండండి

ఇంకొల్లు సింధూరదర్శిని: ఆర్టీసీ సిబ్బంది నిత్యము పని ఒత్తిడితో ఉంటారని అటువంటి ఒత్తిడికిలోను కాకుండా ఆరోగ్యవంతంగా ఉండాలని ఆమె సిబ్బందికి సూచించారు. శ్రీకాళహస్తి డిపోలో ఉదయం 10 గంటల నుండి 14:00 గంటల వరకు వెంకటరమణ హృదయాలయ తిరుపతి వారిచే ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించడమైనది. ఈ క్యాంపు నందు శ్రీకాళహస్తి డిపో సిబ్బంది కి ఉచితముగా ఈ సి హెచ్ ఓ పరీక్షలు చేసినారు.

సుమారు 46 మంది ఆర్టీసీ సిబ్బంది చెక్ చేసుకోవడం జరిగినది. డాక్టర్ బాలచందర్ మరియు వారి సిబ్బంది వారి ఆధ్వర్యంలో చెక్ చేయడం జరిగినది. కార్యక్రమంలో డిపో మేనేజర్ రేవతి మరియు ఆర్టీసీ సిబ్బంది యూనియన్ నాయకులు పాల్గొనినారు.

# నేను మీ బాస్‌ను అంటూ.. ఐనాక్స్ గ్రూప్‌కు రూ.10 కోట్ల సైబర్ మోసం

ఐనాక్స్ గ్రూప్‌లో రూ. 10.4 కోట్ల భారీ వాట్సాప్ స్కామ్ – ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌లా నటించి ఉద్యోగికి టోకరా
రెండు వారాల్లో 63 విడతల్లో డబ్బు బదిలీ – కేసు నమోదు చేసిన ముంబై పోలీసులు, ఢిల్లీలో నలుగురి అరెస్ట్




ముంబై కేంద్రంగా పనిచేస్తున్న ప్రముఖ ఐనాక్స్ గ్రూప్‌లో భారీ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పేరుతో వాట్సాప్ వేదికగా నమ్మించిన కేటుగాళ్లు, ఒక సీనియర్ ఉద్యోగి నుంచి ఏకంగా రూ. 10.4 కోట్లకు పైగా సొమ్మును కాజేశారు. కేవలం రెండు వారాల వ్యవధిలో 63 లావాదేవీల ద్వారా ఈ భారీ మొత్తాన్ని బదిలీ చేయించడం గమనార్హం. ఐనాక్స్ అకౌంట్స్ విభాగంలో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గిరీష్ అమిన్‌కు జూన్ 3వ తేదీన ఒక గుర్తు తెలియని నంబర్ నుంచి వాట్సాప్ సందేశం వచ్చింది. తాను కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిద్ధార్థ్ జైన్‌ను అని, ఇది తన వ్యక్తిగత నంబర్ అని సదరు వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్‌గా సిద్ధార్థ జైన్ ఫోటో ఉండటంతో అమిన్ అతడిని నిజమని నమ్మాడు.

తాను ఒక ముఖ్యమైన సమావేశానికి వెళుతున్నానని, అత్యవసరంగా, కొంత డబ్బు పంపాలని నిందితుడు ఆదేశించాడు. బాస్ ఆదేశాలుగా భావించిన అమిన్, జూన్ 3 నుంచి 15వ తేదీల మధ్య సుమారు 63 విడతల్లో మొత్తం రూ. 10.4 కోట్లను వివిధ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేశాడు. అనంతరం అకౌంట్స్ సమీక్ష సమయంలో, బదిలీ చేసిన నగదుకు సంబంధించిన ఇన్‌వాయిస్‌ల కోసం అమిన్ అధికారికంగా సిద్ధార్థ్ జైన్‌ను సంప్రదించడంతో ఈ మోసం బయటపడింది. తాను అటువంటి ఆదేశాలేవీ ఇవ్వలేదని జైన్ స్పష్టం చేయడంతో బాధితుడు ఖంగుతున్నాడు. కంపెనీ ఫిర్యాదు మేరకు ముంబై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఈ కేసుతో సంబంధం ఉన్న నలుగురిని ఢిల్లీ పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు. ఈ స్కామ్ వెనుక ఒక పెద్ద నెట్‌వర్క్ ఉందని, పరారీలో ఉన్న మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

# డిజిలాకర్‌లోకి 4 రాష్ట్రాల ఫ్యామిలీ ఐడీలు.. 37 కోట్ల మందికి ప్రయోజనం

ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు మరింత సులభతరం
రాజస్థాన్, మహారాష్ట్ర, ఎంపీ, యూపీ ప్రజలకు లబ్ధి
కాగిత రహిత పాలన దిశగా కేంద్రం మరో ముందడుగు




కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ డిజిటల్ డాక్యుమెంట్ వాలెట్ అయిన 'డిజిలాకర్' మరో కీలక మైలురాయిని అందుకుంది. రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన ఫ్యామిలీ ఐడీ (కుటుంబ గుర్తింపు) కార్డులను తన ప్లాట్‌ఫామ్‌లోకి అనుసంధానించినట్లు కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ నిర్ణయంతో నాలుగు రాష్ట్రాల్లోని సుమారు 37 కోట్లకు పైగా పౌరులు తమ కీలకమైన కుటుంబ గుర్తింపు పత్రాలను డిజిటల్‌గా యాక్సెస్ చేసుకోవడం, భద్రపరచడం, అవసరమైన చోట షేర్ చేసుకోవడం వంటివి చేయగలుగుతారు.

ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత సులభంగా అందించడం, భౌతిక పత్రాలపై ఆధారపడటాన్ని తగ్గించడమే ఈ చర్య ముఖ్య ఉద్దేశం. ఈ అనుసంధానం ద్వారా పౌరులు తమ ఫ్యామిలీ ఐడీలను నేరుగా తమ డిజిలాకర్ ఖాతాలోకి పొందవచ్చు. ప్రభుత్వ సేవలకు లేదా ధ్రువీకరణ అవసరమైనప్పుడు ఈ డిజిటల్ కాపీని ఉపయోగించుకోవచ్చు. అంతేకాకుండా అర్హులైన వారు డిజిలాకర్ ప్లాట్‌ఫామ్ నుంచే కొత్త ఫ్యామిలీ ఐడీ కోసం నమోదు చేసుకునే సౌకర్యాన్ని కూడా కల్పించారు.

**ఏ రాష్ట్రంలో ఏ ఐడీ అందుబాటులోకి వచ్చింది?**

రాజస్థాన్: రాష్ట్రంలోని సుమారు 7.5 కోట్ల మంది నివాసితులు తమ 'జన్ ఆధార్' కార్డును డిజిలాకర్‌లో యాక్సెస్ చేయవచ్చు. చిరంజీవి ఆరోగ్య బీమా పథకం, ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్), స్కాలర్‌షిప్‌లు వంటి అనేక సంక్షేమ పథకాలకు జన్ ఆధార్ తప్పనిసరి.

మహారాష్ట్ర: ఇక్కడి సుమారు 14 కోట్ల మంది ప్రజలు తమ 'మహాసారథి (ఫ్యామిలీ ఐడీ)'ని డిజిలాకర్‌లో పొందగలరు. ప్రభుత్వ పథకాలు, సేవలను అందించడంలో ఇది ఒక ప్రాథమిక గృహ గుర్తింపు సాధనంగా పనిచేస్తుంది.

మధ్యప్రదేశ్: రాష్ట్రంలోని దాదాపు 9.5 కోట్ల మంది నివాసితులు తమ 'ఎంపీ సమగ్ర (ఫ్యామిలీ ఐడీ)'ని డిజిటల్‌గా భద్రపరచుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా సంక్షేమ పథకాల పంపిణీలో సమగ్ర ఐడీ కీలక పాత్ర పోషిస్తోంది.

ఉత్తరప్రదేశ్: ఇక ఉత్తరప్రదేశ్‌లో 6 కోట్లకు పైగా ప్రజలు తమ 'యూపీ ఫ్యామిలీ ఐడీ'ని డిజిలాకర్ ద్వారా పొందవచ్చు. స్కాలర్‌షిప్‌లు, పెన్షన్లు, ఇతర రాష్ట్ర సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ డిజిటల్ ఐడీ ఉపయోగపడుతుంది. ఈ సౌకర్యం పొందడానికి పౌరులు డిజిలాకర్ యాప్ లేదా వెబ్‌సైట్‌లోకి సైన్ ఇన్ అయి, సంబంధిత రాష్ట్ర ఫ్యామిలీ ఐడీ సర్వీస్ కోసం వెతకాలి. అవసరమైన వివరాలు నమోదు చేసి, సమ్మతి తెలిపితే చాలు, వెంటనే ఆ డాక్యుమెంట్ యూజర్ డిజిలాకర్ ఖాతాలో భద్రపరచబ డుతుంది. ధ్రువీకరించిన ఈ డిజిటల్ పత్రాన్ని ఉపయోగించడం ద్వారా భౌతిక పత్రాలను వెంట తీసుకెళ్లడం లేదా జిరాక్స్ కాపీలు సమర్పించడం వంటి అవసరం ఉండదని, ఇది కాగిత రహిత పాలనను బలోపేతం చేస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది.

# అంతరిక్షంలోకి భారత సంతతి వ్యోమగామి.. 240 రోజుల పాటు యాత్ర

తొలి అంతరిక్ష యాత్రకు సిద్ధమైన భారత సంతతి వ్యోమగామి అనిల్ మీనన్
జూలై 14న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పయనం – సుమారు 8 నెలల పాటు కొనసాగనున్న యాత్ర
భార్య అన్నా మీనన్ కూడా నాసా వ్యోమగామే

భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి డాక్టర్ అనిల్ మీనన్ తన తొలి అంతరిక్ష యాత్రకు సిద్ధమయ్యారు. 2026 జూలై 14న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) పయనమవనున్న ఆయన, అక్కడ సుమారు ఎనిమిది నెలల పాటు (240 రోజులు) గడపనున్నారు. ఈ మిషన్?లో ఆయన ఫ్లైట్ ఇంజనీర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించనున్నారు. కజకిస్థాన్‌లోని బైకనూర్ కాస్మోడ్రోమ్ నుంచి రష్యాకు చెందిన సోయుజ్ ఎంఎస్–29 వ్యోమనౌక ద్వారా అనిల్ మీనన్ తన ప్రయాణాన్ని ప్రారంభిస్తారు. ఆయనతో పాటు వ్యోమగాములు ప్యోటర్ డుబ్రోవ్, అన్నా కికినా కూడా ఈ యాత్రలో పాలుపంచుకోనున్నారు. అంతరిక్ష కేంద్రంలో ఉన్న సమయంలో ఈ బృందం ఎక్స్‌పెడిషన్ 74, 75లలో భాగంగా వివిధ శాస్త్రీయ పరిశోధనలు, సాంకేతిక ప్రయోగాలు నిర్వహించనుంది. 2027 వసంతకాలంలో వీరు తిరిగి భూమికి చేరుకుంటారు. భారత, ఉక్రెయిన్ వలస దంపతుల కుమారుడైన అనిల్ మీనన్ మిన్నెసోటాలో జన్మించారు. ఆయన హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి న్యూరోబయాలజీలో, స్టాన్‌ఫోర్డ్ నుంచి



మెకానికల్ ఇంజనీరింగ్ మరియు మెడిసిన్ విభాగాల్లో పట్టా పొందారు. 2021లో నాసా వ్యోమగామిగా ఎంపికవడానికి ముందు ఆయన నాసా ఫ్లైట్ సర్జన్‌గా, స్పేస్‌ఎక్స్ సంస్థలో తొలి ఫ్లైట్ సర్జన్‌గా సేవలందించారు. ఆయన భార్య అన్నా మీనన్ కూడా నాసా వ్యోమగామి కావడం విశేషం. ఈ యాత్ర అంతరిక్ష రంగంలో అంతర్జాతీయ సహకారానికి, నాసాలో భారత సంతతి నిపుణుల పెరుగుతున్న ప్రాధాన్యతకు నిదర్శనంగా నిలుస్తోంది. తన యాత్రకు ముందు, జూన్ 22 నుంచి రష్యాలోని స్టార్ సిటీ నుంచి అనిల్ మీనన్ పరిమితంగా వర్చువల్ మీడియా ఇంటర్వ్యూలలో పాల్గొంటారని నాసా అధికారికంగా ప్రకటించింది.

# రెండో వన్డే: టాస్ గెలిచిన ఆఫ్ఘన్.. టీమిండియాలో కొత్త ప్లేయర్ అరంగేట్రం



లక్నోలోని అటల్ బిహారీ వాజ్‌పేయి ఏకానా క్రికెట్ స్టేడియం వేదికగా జరుగుతున్న రెండో వన్డేలో ఆఫ్ఘనిస్థాన్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్ చేసేందుకు టీమిండియా సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో ఇప్పటికే 1–0 ఆధిక్యంలో ఉన్న భారత్, ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకోవాలని చూస్తుండగా, సిరీస్‌లో నిలవాలంటే ఆఫ్ఘనిస్థాన్‌కు ఈ మ్యాచ్‌లో విజయం తప్పనిసరి.

ఈ మ్యాచ్‌లో భారత జట్టు యాజమాన్యం మరో యువ ఆటగాడికి అవకాశం కల్పించింది. యువ బౌలర్ ప్రిన్స్ యాదవ్‌కు అరంగేట్రం చేసే అవకాశం ఇచ్చింది. దీంతో ఈ సిరీస్‌లో టీమిండియా తరఫున అరంగేట్రం చేసిన మూడో ఆటగాడిగా ప్రిన్స్ నిలిచాడు. తొలి వన్డేలో హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్ తమ అంతర్జాతీయ కెరీర్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. క్వాడ్ సమస్యల కారణంగా ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేదని జట్టు యాజమాన్యం తెలిపింది. ప్రిన్స్ యాదవ్‌తో పాటు యశస్వి జైస్వాల్, కుల్దీప్ యాదవ్ కూడా తుది జట్టులోకి వచ్చారు.

టాస్ గెలిచిన అనంతరం ఆఫ్ఘనిస్థాన్ కెప్టెన్ హష్మతుల్లా షాహిది మాట్లాడుతూ.. "వికెట్ తాజాగా కనిపిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో పిచ్ స్పిన్నర్లకు అనుకూలించే అవకాశం ఉంది. అందుకే బౌలింగ్ ఎంచుకున్నాం. గత మ్యాచ్‌లో మేం బాగానే ఆడినా భాగస్వామ్యాలు నెలకొల్పడంలో విఫలమయ్యాం. ఒకే ఒక్క భాగస్వామ్యం తర్వాత వరుసగా వికెట్లు కోల్పోయాం. ఈసారి బలంగా పుంజుకుంటామని ఆశిస్తున్నాం. మా కుర్రాళ్లకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. జట్టులో మూడు మార్పులు చేశాం. నబీ అనారోగ్యంతో, అజ్మత్ గాయంతో దూరమయ్యారు. జియా ఉర్ రెహ్మాన్ కూడా ఆడటం లేదు. వారి స్థానంలో బిలాల్, దర్విష్ రసూలీ, మరో ఆటగాడు జట్టులోకి వచ్చారు" అని తెలిపాడు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. "మేం కూడా టాస్ గెలిచి ఉంటే బౌలింగే ఎంచుకునేవాళ్లం. ప్రస్తుతం ఐదుగురు బౌలర్లతోనే ఆడాల్సి వస్తోంది. కఠిన పరిస్థితులను ఎదుర్కోవడం, భారీ స్కోర్లను ఛేదించడం, బౌలింగ్‌లో పదునుగా రాణించడం వంటి అంశాలపై దృష్టి పెట్టాం. జట్టులో మూడు మార్పులు జరిగాయి. ప్రిన్స్ అరంగేట్రం చేస్తున్నాడు. అతనితో పాటు కుల్దీప్, జైస్వాల్ కూడా జట్టులోకి వచ్చారు" అని చెప్పాడు. ధర్మశాలలో వర్షం కారణంగా 25 ఓవర్లకు కుదించిన తొలి వన్డేలో భారత్ 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. పలువురు సీనియర్ ఆటగాళ్లు అందుబాటులో లేకపోవడంతో యువ ఆటగాళ్లకు ఈ సిరీస్ మంచి అవకాశంగా మారింది.

**తుది జట్లు:** భారత్: యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మ, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, గుర్నూర్ బ్రార్, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్.

**ఆఫ్ఘనిస్థాన్:** రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్, సెదిఖుల్లా అటల్, రహ్మత్ షా, హష్మతుల్లా షాహిది (కెప్టెన్), దర్విష్ రసూలీ, రషీద్ ఖాన్, నంగ్యాలియా ఖరోటి, ఏఎం ఘజన్ఫర్, మహ్మద్ సలీం సఫీ, బిలాల్ సమీ.



## గిల్ సరికొత్త చరిత్ర.. కోహ్లీ రికార్డు బద్దలు

**స్వదేశంలో అత్యంత వేగంగా 1000 వన్డే పరుగులు చేసిన గిల్**

**ఈ క్రమంలో విరాట్ కోహ్లీ రికార్డును అధిగమించిన యువ బ్యాటర్**

**లిస్ట్ ఏ క్రికెట్‌లో 14,000 పరుగులు పూర్తి చేసిన రోహిత్ శర్మ**

టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అరుదైన రికార్డు సృష్టించాడు. స్వదేశంలో వన్డే ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 1000 పరుగులు పూర్తి చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలో భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రికార్డును అతను బద్దలుకొట్టాడు. ఆఫ్ఘనిస్థాన్‌తో లక్నో వేదికగా జరుగుతున్న రెండో వన్డేలో ఈ ఘనత సాధించాడు. అద్భుతమైన ఫామ్‌తో ఆకట్టుకున్న గిల్, ఈ మ్యాచ్‌లో అర్ధశతకం పూర్తి చేసి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపాడు.

ఈ మ్యాచ్‌లో స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ కూడా మరో మైలురాయిని అందుకున్నాడు. లిస్ట్ ఏ క్రికెట్‌లో 14,000 పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా నిలిచాడు. అంతకుముందు టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్థాన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్ కోసం భారత జట్టులో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. యువ ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్ ఈ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. తుది జట్టులోకి కుల్దీప్ యాదవ్, యశస్వి జైస్వాల్ కూడా వచ్చారు. ఇక, ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేస్తున్న భారత్ 30 ఓవర్లు ముగిసేరికి 2 వికెట్లు కోల్పోయి 220 పరుగులు చేసింది. మూడు వన్డేల ఈ సిరీస్‌లో ఇప్పటికే భారత్ శుభారంభం చేసింది. తొలి వన్డేలో 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి 1–0 ఆధిక్యంలో ఉన్న విషయం తెలిసిందే.



## ఇక బ్యాంకుల ఇష్టం చెల్లదు..

**అవసరం లేని పాలసీలు, లోన్లు అంటగట్టొద్దు!: ఆర్‌బీఐ**

**బ్యాంకుల మిస్ సెల్లింగ్‌పై ఆర్‌బీఐ కఠిన నిబంధనలు**

**లోన్ కోసం బీమా పాలసీ కొనాలని బలవంతం చేయొద్దు**

**ప్రతి ఉత్పత్తికి విడిగా కస్టమర్ అంగీకారం తప్పనిసరి**

**డిజిటల్ వేదికల్లో మభ్యపెట్టే పద్ధతులపై నిషేధం**

**2027 జనవరి 1 నుంచి అమల్లోకి కొత్త నిబంధనలు**

బ్యాంకుకు ఓ పనిమీద వెళ్తే మరో ప్రొడక్ట్‌ను అంటగట్టడం, లోన్ తీసుకోవాలంటే బీమా పాలసీ తప్పనిసరి అని చెప్పడం, మొబైల్ యాప్ తెరిస్తే వరుసగా లోన్ ఆఫర్లు చూపించడం వంటి పద్ధతులకు త్వరలో చెక్ పడనుంది. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆర్‌బీఐ కఠిన నిబంధనలను తీసుకొచ్చింది. బ్యాంకులు అనుసరించాల్సిన కొత్త మార్గదర్శకాలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి.

ఇప్పటి వరకు బ్యాంకింగ్ రంగంలో తరచూ వినిపించిన ఫిర్యాదుల్లో 'మిస్ సెల్లింగ్' ఒకటి. అంటే వినియోగదారుడికి అవసరం లేని ఫైనాన్షియల్ ప్రొడక్ట్‌ను అమ్మడం. సరైన సమాచారం ఇవ్వకుండా ఒప్పించడం. అనుమతి లేకుండానే పాలసీలు లేదా ఇతర సేవలు జత చేయడం వంటి చర్యలు ఇందులోకి వస్తాయి. ఇలాంటి వ్యవహారాలకు తొలిసారి స్పష్టమైన నిర్వచనం ఇచ్చిన ఆర్‌బీఐ వాటిపై కఠిన వైఖరి అవలంబించింది. కొత్త నిబంధనల ప్రకారం రుణం మంజూరు చేయాలంటే తప్పనిసరిగా బీమా పాలసీ కొనాలని బ్యాంకులు షరతు విధించకూడదు. గృహ రుణం లేదా వ్యక్తిగత రుణం తీసుకునే సమయంలో బీమా అవసరమైతే వినియోగదారుడు తనకు నచ్చిన సంస్థ నుంచి పాలసీ తీసుకునే స్వేచ్ఛ ఉండాలి. బ్యాంకు సూచించిన సంస్థ నుంచే కొనాలంటూ ఒత్తిడి చేయడం నిషేధం. వినియోగదారుడి సమ్మతికి కూడా కొత్త నిర్వచనం తీసుకొచ్చింది ఆర్‌బీఐ. ఒక ఉత్పత్తికి ఇచ్చిన అంగీకారాన్ని మరో ప్రొడక్ట్‌ను వర్తింపచేయకూడదు. రుణం తీసుకున్న వ్యక్తికి అదే ఆధారంగా బీమా, పెట్టుబడి పథకాలు లేదా ఇతర ఆఫర్లను పంపడం కుదరదు. ప్రతి ఉత్పత్తికి విడిగా స్పష్టమైన అనుమతి తీసుకోవాల్సిందే.

డిజిటల్ వేదికల్లో బ్యాంకులు అనుసరిస్తున్న పలు పద్ధతులపై కూడా ఆర్‌బీఐ దృష్టి పెట్టింది. కస్టమర్లను మభ్యపెట్టేలా కౌంట్‌డౌన్ టైమర్లు చూపించడం, ముందుగానే టిక్ చేసిన ఆప్షన్స్ ఉంచడం, తిరస్కరించే బటన్‌ను గందరగోళంగా చూపించడం, మూసివేయాలనుకుంటే లోన్ పేజీకి తీసుకెళ్లే పాప్‌అప్‌లు చూపించడం వంటి పద్ధతులను నిషేధించింది.

లోన్ దరఖాస్తు సమయంలో వినియోగదారుడికి తెలియకుండా బీమా పాలసీని జత చేయడం, చివరి దశలో అదనపు ఛార్జీలను చూపించడం, అత్యవసర హెచ్చరికలా కనిపించే ప్రకటనలు పంపించడం వంటి చర్యలు కూడా ఇక అనుమతించబోవడం లేదు. బ్యాంకుల తరఫున పనిచేసే డైరెక్ట్ సేలింగ్ ఏజెంట్లు, మార్కెటింగ్ ప్రతినిధులపైనా కొత్త నియంత్రణలు అమల్లోకి రానున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల మధ్య మాత్రమే వినియోగదారులను సంప్రదించాలి. అనుమతి లేకుండా ఇంటికి లేదా కార్యాలయానికి వెళ్లకూడదు. తమను బ్యాంకు ఉద్యోగులుగా పరిచయం చేసుకోవడం కూడా నిషేధం. ఈ మార్గదర్శకాల ప్రకారం నిబంధనలు ఉల్లంఘించి వినియోగదారుడికి తప్పుడు ప్రొడక్ట్‌ను విక్రయించినట్లు తేలితే బ్యాంకు వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలి. వినియోగదారుడు ఎదుర్కొన్న నష్టానికి పరిహారం కూడా ఇవ్వాల్సి రావచ్చు.

## నీట్ రీ-టెస్ట్: టెలిగ్రామ్‌పై నిషేధం..

**ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన సంస్థ – నీట్ రీ-టెస్ట్‌కు ముందు తాత్కాలిక నిషేధం**

**జూన్ 30 వరకు మెసేజ్ ఎడిట్ ఫీచర్ నిలిపివేత**

**ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు ప్రచారాన్ని అడ్డుకోవడమే లక్ష్యమన్న ఎన్‌టీఏ**

**కోట్లాది వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారని టెలిగ్రామ్ వాదన**

**అత్యవసర విచారణకు ఢిల్లీ హైకోర్టు అంగీకారం**

నీట్–యూజీ రీటెస్ట్‌కు ముందు కేంద్ర ప్రభుత్వం విధించిన తాత్కాలిక నిషేధంపై మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ అంశంపై అత్యవసర విచారణ జరపాలని సంస్థ చేసిన విజ్ఞప్తిని కోర్టు అంగీకరించింది. నీట్ రీ-టెస్ట్ జూన్ 21న జరగనుంది. పరీక్షకు ముందు ప్రశ్నపత్రాల లీకేజీ, తప్పుడు సమాచార ప్రచారాన్ని అడ్డుకునేందుకు టెలిగ్రామ్‌పై 24 గంటల పాటు నిషేధం విధించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) సిఫారసు మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ప్రశ్నపత్రాల లీకేజీలకు పాల్పడే ముఠాలు, పరీక్షల్లో అక్రమాలకు సహకరించే నెట్‌వర్క్‌లను అడ్డుకోవడమే ఈ చర్యల లక్ష్యమని అధికారులు పేర్కొన్నారు. అదే సమయంలో జూన్ 30 వరకు టెలిగ్రామ్‌లో మెసేజ్ ఎడిట్ చేసే సదుపాయాన్ని కూడా నిలిపివేయాలని సంస్థను ఆదేశించారు. మెసేజ్‌లను




తర్వాత సవరించే సదుపాయాన్ని కొందరు దుర్వినియోగం చేస్తున్నారని ఎన్‌టీఏ ఆరోపిస్తోంది. పరీక్ష పూర్తైన తర్వాత ప్రశ్నపత్రాలను పాత సందేశాల్లో చేర్చి, అవి ముందుగానే లీకైనట్లు చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపింది. దీంతో పరీక్షల విశ్వసనీయతపై సందేహాలు తలెత్తుతున్నాయని పేర్కొంది. మరోవైపు టెలిగ్రామ్ ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కొందరి తప్పిదాల కారణంగా కోట్లాది మంది సాధారణ వినియోగదారులను ఇబ్బందులకు గురిచేయడం సరైన విధానం కాదని వాదిస్తోంది. సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ పావెల్ దురోవ్ స్పందిస్తూ.. ప్రశ్నపత్రాల లీకేజీకి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాల్సింది పోయి సాధారణ వినియోగదారులపై ప్రభావం చూపే నిర్ణయాలు తీసుకోవడం సమస్యకు పరిష్కారం కాదన్నారు. ఇలాంటి ఆంక్షల వల్ల లీకేజీలు ఆగిపోవని, అవి మరో వేదికకు మారే అవకాశమే ఎక్కువని వ్యాఖ్యానించారు.

## మెటా కీలక నిర్ణయం.. ఫీజుల బాటలో ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్.. కారణమిదే!

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లకు సంబంధించి మాతృసంస్థ 'మెటా ప్లాట్‌ఫామ్స్' ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు ఉచితంగా అందిస్తున్న ఈ యాప్‌లలో అదనపు ఫీచర్ల కోసం ఐచ్ఛిక పెయిడ్ సబ్‌స్క్రిప్షన్లను అందుబాటులోకి తెచ్చింది. 'ప్లస్' పేరుతో వస్తున్న ఈ కొత్త సేవలు మే నెలాఖరు నుంచి ప్రపంచవ్యాప్తంగా దశలవారీగా అమల్లోకి వచ్చాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో వేల కోట్ల డాలర్లు పెట్టుబడిగా పెడుతున్న తరుణంలో, కేవలం ప్రకటనల ఆదాయంపైనే ఆధారపడకుండా కొత్త ఆదాయ మార్గాలను సృష్టించుకోవడమే లక్ష్యంగా మెటా ఈ అడుగు వేసింది.

**భారత్‌లో రూ.99కే ప్రీమియం ప్లాన్లు**

ఈ కొత్త ప్లాన్ల ప్రకారం, 'ఇన్‌స్టాగ్రామ్ ప్లస్', 'ఫేస్‌బుక్ ప్లస్' కోసం నెలకు సుమారు 3.99 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. భారత్‌లో దీని ధరను ప్రారంభ ఆఫర్లతో కలిపి సుమారు రూ.99గా నిర్ణయించారు. అదేవిధంగా 'వాట్సాప్ ప్లస్' సబ్‌స్క్రిప్షన్ కోసం నెలకు 2.99 డాలర్లు (భారత్‌లో సుమారు రూ.99) చెల్లించాలి. ఈ ప్లాన్లు తీసుకున్న యూజర్లకు స్టోరీల నిడివి పెంచుకోవడం, ప్రొఫైల్ కస్టమైజేషన్, సూపర్ రియాక్షన్లు, సీక్రెట్ స్టోరీ వ్యూయింగ్, మరిన్ని చాట్‌లను పిన్ చేసుకునే సౌలభ్యం వంటి పలుప్రీమియం ఫీచర్లు అందుబాటులోకి వస్తాయి. అయితే, ప్రస్తుతం ఉన్న ప్రాథమిక సేవలు యథాతథంగా అందరికీ ఉచితంగానే కొనసాగుతాయని, వాటిలో ఎలాంటి మార్పు ఉండదని మెటా స్పష్టం చేసింది.

**ఏఐ పెట్టుబడుల కోసమే ఈ వ్యూహం**

మెటా ఈ ఏడాది తన మూలధన వ్యయాన్ని ఏకంగా 125 బిలియన్ డాలర్ల నుంచి 145 బిలియన్ డాలర్లకు పెంచింది. ఈ భారీ మొత్తాన్ని ప్రధానంగా ఏఐ డేటా సెంటర్లు, కంప్యూటింగ్ పవర్, ఇతర మౌలిక సదుపాయాల కోసమే కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలోనే ప్రకటనలకు అతీతంగా స్థిరమైన ఆదాయాన్ని సమకూర్చుకోవడం కంపెనీకి అత్యవసరంగా మారింది. ఇటీవలే భారత్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో కలిసి గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఒక ఏఐ డేటా సెంటర్‌ను అభివృద్ధి చేసేందుకు మెటా ఒప్పందం కుదుర్చుకోవడం గమనార్హం. ఈ కొత్త సబ్‌స్క్రిప్షన్ల ద్వారా దీర్ఘకాలంలో కంపెనీకి గణనీయమైన ఆదాయం లభించవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. యూజర్లు కోరుకుంటున్న ఎన్నో మెరుగైన ఫీచర్లను ఈ 'ప్లస్' సేవల్లో అందిస్తున్నామని మెటా ప్రొడక్ట్ హెడ్ నవోమి గ్లీట్ తెలిపారు. త్వరలో వ్యాపారాలు, క్రియేటర్ల కోసం, అలాగే నెలకు 19.99 డాలర్ల వరకు ఉండే అధునాతన ఏఐ ఫీచర్ల కోసం కూడా ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్లను పరీక్షిస్తున్నట్లు ఆమె వెల్లడించారు.

అయితే, ఈ కొత్త పెయిడ్ ప్లాన్లపై నిపుణుల నుంచి, యూజర్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఏఐపై చేస్తున్న భారీ ఖర్చును సమర్థించుకోవడానికి మెటాకు ఇలాంటి ఆదాయ మార్గాలు అవసరమని 'టెకార్క్' నిపుణుడు ఫైసల్ కవూసా అభిప్రాయపడగా, ఏఐ పెట్టుబడులపై బలమైన రాబడి వచ్చే వరకు ఇవి కేవలం ఒక 'స్టాప్‌గ్యాప్' ఏర్పాటు మాత్రమేనని ఏఐ నిపుణుడు శ్రీనివాస్ పద్మనాభుని పేర్కొన్నారు. పవర్ యూజర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు మినహా సాధారణ యూజర్లు డబ్బు చెల్లించి ఈ సేవలు పొందేందుకు పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చని ప్రాథమిక స్పందనలు సూచిస్తున్నాయి.

# సినిమా న్యూస్

## ‘రమణి కల్యాణం’ మూవీ రివ్యూ!



సూర్య వశిష్ఠ – దీప్సిక చంద్రన్ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమానే ‘రమణి కల్యాణం’. విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వం వహించిన ఈ సినిమా, మే 22వ తేదీన థియేటర్లలో విడుదలైంది. ఈ నెల 12వ తేదీ నుంచి ‘ఈటీవీ విన్’ లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సినిమా కథేమిటనేది ఇప్పుడు చూద్దాం.

సంజన (దీప్సిక) చూపులేని అమ్మాయి. తల్లీదండ్రులను కోల్పోయిన ఆమె, బామ్మ దగ్గరే పెరుగుతుంది. అనాథలైన నలుగురు పిల్లలను దత్తత చేసుకుని వాళ్ల ఆలనా పాలనా చూస్తుంటుంది. ఒక వైపున పబ్ లో సింగర్ గా.. మరో వైపున ఒక ఎఫ్ ఎమ్ రేడియోలో ఆర్జేగా పనిచేస్తుంటుంది. తనకి చూపు లేకపోవడాన్ని ఒక లోపంగా భావించడం ఆమెకి ఎంతమాత్రం ఇష్టం ఉండదు. ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళుతుంటుంది. అలాంటి సమయంలోనే ఆమెకి రాజ్ (సూర్య వసిష్ఠ) తారసపడతాడు.

రాజ్ మంచి కవి .. అతని రెండు కాళ్లూ పనిచేయవు. అందువలన అతను వీల్ ఛైర్ కి పరిమితమవుతాడు. అనాథగా మిగిలిపోయిన రాజ్ ను అతని స్నేహితులైన కిశోర్ – గీత (శ్రీనివాసరెడ్డి – శ్యామల) దంపతులు చూసుకుంటూ ఉంటారు. రెండు కాళ్లను కోల్పోయిన కారణంగా రాజ్ చాలా డీలాపడిపోతాడు. పోయింది నడక మాత్రమే తప్ప, భవిష్యత్తు కాదనే సంజన మాటలు అతనిలో కొత్త ఆశలను రేకెత్తిస్తాయి. వాళ్లిద్దరి మధ్య పరిచయం ప్రేమగా మారుతుంది.

సంజనకి చూపులేని కారణంగా సంబంధాలు రావడమే కష్టమైపోతుంది. వచ్చిన సంబంధాలు ఆమె పెంచుతున్న పిల్లల కారణంగా వెళ్లిపోతుంటాయి. అలాంటి సమయంలో ఆమె రాజ్‌ను ప్రేమించడం బామ్మకు ఆనందాన్ని కలిగిస్తుంది. ఇక ఒంటరిగా మిగిలిపోయిన దగ్గర నుంచి కుమిలిపోతున్న రాజ్, సంజన రాకతో సంతోషంగా ఉండటం కిశోర్ దంపతులకు ఆనందాన్ని ఇస్తుంది. సంజన – రాజ్ పెళ్లి చేసుకుందామని అనుకుంటూ ఉండగా ఒక అనూహ్యమైన సంఘటన జరుగుతుంది. అదేమిటి? అది వాళ్ల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది కథ.

చూపులేని అమ్మాయి .. కాళ్లు లేని అబ్బాయి. ఒకరు కవి అయితే .. మరొకరు గాయని. అలాంటి ఈ ఇద్దరి మధ్య నడిచే ప్రేమకథ ఇది. ఇద్దరూ ఆయా సందర్భాలలో తల్లిదండ్రులను కోల్పోయినవారే. అలాంటి ఆ ఇద్దరూ కలిసి నడవాలని అనుకుంటారు .. కలిసి బతకాలని నిర్ణయించుకుంటారు. సన్నిహితులంతా వాళ్ల నిర్ణయం పట్ల హర్షాన్ని వ్యక్తం చేస్తారు. అలాంటి ఆ సమయంలో ఏం జరిగిందనే ఒక అంశం చుట్టూ దర్శకుడు ఈ కథను నడిపించాడు.

ఫస్టాఫ్ అంతా హీరో – హీరోయిన్ పరిచయం, ఆ పరిచయం ప్రేమకి దారితీయడం వంటి సన్నివేశాలతో ఈ కథ ముందుకు వెళుతుంది. ఇద్దరి ఫ్లాష్ బ్యాకులు కూడా ఫస్టాఫ్ లోనే వచ్చేస్తాయి. ఈ సమయంలో వచ్చే బ్యాంగ్ తోనే ఇంటర్వెల్ కార్డు పడుతుంది. ఆ తరువాత నుంచి కథలో చోటుచేసుకునే సన్నివేశాలు ఎలా ఉండనున్నాయి? అనే ఒక ఆసక్తి ఆడియన్స్ లో మొదలవుతుంది. ప్రీ క్లైమాక్స్ తో వచ్చే ట్విస్ట్ తో ఈ కథను క్లైమాక్స్ దిశగా పరిగెత్తించారు.

చూపులేని హీరోయిన్ .. కాళ్లు లేని హీరో అనగానే, ఎంజాయ్ చేయలేని ప్రేక్షకులు అనే మాటనే ఆ తరువాత వినిపిస్తుంది. చూపులేని వాళ్లను హీరోయిన్ రోడ్డు దాటిస్తుంటే ఆడియన్స్ ముచ్చట పడతారు. కాళ్లు లేనివారికి హీరో సాయం చేస్తే శభాష్ అంటూ మెచ్చుకుంటారు. కానీ హీరోయిన్ కే చూపులేకపోతే, హీరోకే కాళ్లు లేకపోతే .. అనే ఆలోచనకు దృశ్య రూపమే ఈ సినిమా. అయ్యో పాపం ఇద్దరికీ ఇలా అయిందే అనుకుంటూ సర్దుకుపోదామని అనుకుంటే, ఆ ఇద్దరూ తమ తల్లిదండ్రులను వేరు వేరు సంఘటనలలో కోల్పోవడం తాలూకు ఫ్లాష్ బ్యాకులొచ్చి మీద పడతాయి. వాటి బరువు మోయలేక ఆడియన్స్ విలవిలలాడుతూ ఉండగానే, మరో ట్విస్ట్. తెరపై హీరో– హీరోయిన్ లను కోలుకోనీయలేదు .. ఆడియన్స్ ను తేరుకోనీయలేదు.

హీరో – హీరోయిన్స్‌ను అలా చూడగానే ఆడియన్స్ వినోదం శూన్యమనుకునే కూర్చుంటారు. అయినా ఊహించుకోవచ్చుగదా అన్నట్టుగా పాటలు పెట్టారు. అవి కూడా అంతంత మాత్రమే. చూపులేని అమ్మాయిగా చేయడానికి హీరోయిన్ .. కాళ్లు లేనివాడిగా కనిపించడానికి హీరో చాలా కష్టపడ్డారని అనుకోవడం సహజం. కానీ నిజానికి అసలైన కష్టం ఆడియన్స్ దేనని చెప్పాలి. ఆ ఇద్దరినీ అలా చూస్తూ కూర్చోవడం అంత సామాన్యమైన విశేషమేం కాదు మరి.

అరవింద్ తిరుకోవేల ఫొటోగ్రఫీ .. రవితేజ గిరిజాల ఎడిటింగ్ .. సూరజ్ కురుప్ సంగీతం ఓ మాదిరిగా అనిపిస్తాయి. ఇలాంటి కథలు 1980లలో చాలానే వచ్చాయి. సెంటిమెంట్ .. ఎమోషన్స్ తాలూకు కంటెంట్ ను ప్రేక్షకులు ఆదరించిన రోజులవి. కానీ ఇప్పుడు ఈ తరహా కథలతో ఆడియన్స్ ను మెప్పించడం కష్టమనే చెప్పాలి. హీరో – హీరోయిన్స్ కి శారీరక లోపాలు కలిగించి, వాళ్ల ద్వారా అన్నివైపుల నుంచి పండే వినోదానికి తలుపులు మూసేయడమే ప్రధానమైన లోపం అని చెప్పాలి.

కొన్ని కథలు మాత్రమే పుస్తకం నుంచి తెరపైకి వస్తే బాగుంటాయి. కొన్ని కథలు పుస్తకానికి పరిమితమవుతేనే బాగుంటాయి. ఈ రెండో వర్గానికి చెందిన కథలను తెరపైకి తీసుకుని వస్తే ఎలా ఉంటుందనడానికి సమాధానమే ఈ సినిమా. రొటీన్ కంటెంట్ తో రావడం .. వినోదానికి దూరంగా వెళ్లడమే ఈ సినిమా నిరాశపరచడానికి ప్రధాన కారణంగా చెప్పుకోవలసి ఉంటుంది.

సినిమా వివరాలు
సినిమా పేరు: రమణి కళ్యాణం
విడుదల తేదీ: 2026-06-12
తారాగణం: సూర్య వశిష్ట, దీప్సిక చంద్రన్, శ్రీనివాస రెడ్డి, శ్యామల, తెనాలి శకుంతల
దర్శకుడు: విజయ్ ఆదిరెడ్డి
సంగీతం: సూరజ్ కురుప్
బ్యానర్: కైట్స్ క్రియేటివ్స్
సమీక్ష: పెద్దింటి
రమణి కళ్యాణం రేటింగ్: 5కి 1.50

## కత్తి పట్టిన ఆధునిక సీత.. అదరగొడుతున్న అలియా భట్ ‘ఆల్ఫా’ ట్రైలర్




బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిలిమ్స్ (వైఆర్ఎఫ్) తమ స్పై యూనివర్స్‌లో మరో కొత్త చిత్రాన్ని ప్రకటించింది. అలియా భట్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు ‘ఆల్ఫా’ అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్‌ను తాజాగా విడుదల చేయగా, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమా జులై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

ఈ చిత్రంలో అలియా భట్ ‘సీత’ అనే ఒక పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు. చిన్నతనం నుంచే ఆమె తండ్రి (బాబీ డియోల్) ఒక కఠినమైన సీక్రెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఆమెను ఒక కిరాయి హంతకురాలిగా తీర్చిదిద్దుతాడు. ఆధునిక కాలపు సీత తనదైన ‘అగ్ని పరీక్ష’ను ఎలా ఎదుర్కొంది అనే థీమ్‌తో ఈ సినిమా సాగనుంది. టీజర్‌లో అలియా భట్ భీకరమైన యాక్షన్ సన్నివేశాల్లో కనిపించారు. కత్తి యుద్ధాలు, ఛేజింగ్ సీన్లు ఆమె పాత్రలోని క్రూరమైన, భీకరమైన కోణాన్ని ఆవిష్కరించాయి. 18వ పుట్టినరోజునే ఆమెను ‘ఆల్ఫా’ అనే ఎలైట్ ఆపరేటివ్‌గా మార్చే సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. ఈ సినిమాలో అలియా భట్‌తో పాటు మరో నటి శర్వరీ వాఘ్ కూడా ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. ఇద్దరు మహిళా ఆపరేటివ్‌లు కలిసి ఒక శక్తివంతమైన శత్రువును ఎలా ఎదుర్కొన్నారు అనేది కథలో కీలకం. సీనియర్ నటుడు అనిల్ కపూర్ ఒక ముఖ్యమైన ఇంటెలిజెన్స్ అధికారి పాత్రలో నటిస్తుండగా, ఈ సినిమాకు అసలైన హైలైట్ హృతిక్ రోషన్ కావడం విశేషం. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లోని ‘వార్’ సిరీస్‌లో తను పోషించిన ‘కబీర్’ పాత్రలో హృతిక్ ఇందులో ప్రత్యేక అతిథిగా కనిపించనున్నారు. దీంతో ఈ సినిమా కూడా టైగర్, వార్ ఫ్రాంచైజీల ప్రపంచంలో భాగమని స్పష్టమైంది. ‘ది రైల్వే మెన్’ సిరీస్‌తో విమర్శకుల ప్రశంసలు పొందిన శివ్ రావల్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆదిత్య చోప్రా నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారతదేశంలో పూర్తిస్థాయిలో మహిళా ప్రధాన పాత్రలతో వస్తున్న తొలి భారీ యాక్షన్ చిత్రంగా ‘ఆల్ఫా’ నిలవనుంది. పోస్ట్ ప్రొడక్షన్, వీఎఫ్ఎక్స్ పనుల్లో ఆలస్యం కారణంగా పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా జులై 3న విడుదల కానుంది.




అందమైన పసుపు–తెలుపు డిజైన్ కలిగిన క్రాప్ టాప్‌లో, ఆకర్షణీయమైన సైడ్ ప్రొఫైల్ పోర్ట్రెయిట్‌లో అషికా రంగనాథ్ మంత్రముగ్ధులను చేస్తోంది. ప్రత్యేకమైన లైటింగ్ మధ్య, ఒక చేతిని ముఖం దగ్గర ఉంచుకుని ఆమె ఎంతో హుందాగా పోజిస్తూ, ఆత్మవిశ్వాసాన్ని మరియు సహజ సౌందర్యాన్ని ప్రదర్శిస్తోంది.

## మెగాస్టార్ చిరంజీవి వ్యక్తిత్వంపై జగపతిబాబు ప్రశంసలు

**తన తొలి సినిమాకు క్లాప్ కొట్టాలని కోరడానికి చిరంజీవి ఇంటికి వెళ్లామన్న జగపతిబాబు**

**తనను, తన తండ్రిని చిరంజీవి ఆత్మీయంగా ఆహ్వానించారని వెల్లడి**

**సినిమా ప్రారంభోత్సవానికి వచ్చి క్లాప్ కొట్టారన్న జగపతిబాబు**



టాలీవుడ్ సీనియర్ నటుడు జగపతిబాబు తాజాగా ఒక ఇంటర్వ్యూలో మెగాస్టార్ చిరంజీవి గురించి పంచుకున్న కొన్ని ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. జగపతిబాబు హీరోగా పరిచయమైన తొలి సినిమా ‘సింహ స్వప్నం’. ఆ సినిమా ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టాల్సిందిగా కోరడానికి జగపతిబాబు, ఆయన తండ్రి వీబీ రాజేంద్రప్రసాద్ కలిసి చిరంజీవి ఇంటికి వెళ్లారట. అప్పట్లో చిరంజీవి గారు వరుస సినిమాలతో ఫుల్ బిజీగా, స్టార్‌డమ్‌లో పీక్స్‌లో ఉన్నప్పటికీ.. వీరిని ఎంతో ఆత్మీయంగా ఆహ్వానించారట. అంతేకాదు, జగపతిబాబును చూడగానే “చాలా అందంగా ఉన్నావు” అని మెచ్చుకుని, అడగడమే ఆలస్యం వెంటనే వచ్చి సినిమా ప్రారంభోత్సవానికి క్లాప్ కొట్టారని జగపతిబాబు గుర్తుచేసుకున్నారు. ఇక ఆ సంఘటన జరిగిన దాదాపు 35 సంవత్సరాల తర్వాత, ‘పెద్ది’ సినిమాలో జగపతిబాబు పోషించిన పాత్రను చూసి చిరంజీవి మళ్లీ అదే స్థాయిలో ఫోన్ చేసి మరీ ప్రశంసించారట. చిరంజీవిలోని ఆ గొప్ప గుణాన్ని జగపతిబాబు ఈ ఇంటర్వ్యూలో ఎంతో సంతోషంగా పంచుకున్నారు. ఒకప్పుడు హీరోగా ఎన్నో సూపర్ హిట్ సినిమాలు అందించిన జగపతిబాబు, ప్రస్తుతం వైవిధ్యమైన క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, పవర్‌ఫుల్ విలన్‌గా తనదైన నటనతో ప్రేక్షకులను అలరిస్తూ దూసుకుపోతున్నారు.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662